ఆదివిష్ణు నాటిక




[తెర తొలిగింది. అదొక హోటల్. లాంజ్ కనుపిస్తోంది. లాంజ్ కెదురుగా రెండే గదు లున్నాయి. ప్రేక్షకులకు కుడివైపున్న గది నెంబరు నూట ఒకటి. ఎడంవేపున్న గది నెంబరు నూటరెండు. నెంబరు ప్లేట్లు ఆ యా గదులకు తగిలించబడి వున్నాయి.

ఈ రెండు గదులే ప్రేక్షకులకు కనిపిస్తాయి. నెంబరు నూటఒకటి ప్రక్కనే మేడమెట్లు

## ఇందులోని పాత్రలు

రాంబాబు : మేధావి. కుర్రతనం జాస్తి.
అప్పారావు : ఇంటి పేరు నిప్పు. పోలీసు కానిస్టేబిల్.
దీనబంధు : ఇది బిరుదు. ప్రజానాయకుడు.
ప్లీడరు : పేరు తెలీదు. అందరూ దేవుడి ప్లీడరంటారు.
మాలీషు : పేరు లేదు. వళ్ళు పట్టడం వృత్తి.
శంకరం : పూర్తి పేరు భవానీ శంకరం. కొత్తగా పెళ్ళిచేసుకున్నాడు.
ధనకోటి : ఇంకేం ఫేక్టరీ ఓనరు!
బోయ్ : హోటళ్ళలో దొరుకుతాడు.
సుగుణ : శంకరం భార్య. ఈ వివరం చాలు!

న్నాయి. ఆ మెట్లెక్కిపైకి వెళ్ళవచ్చు. ఆ మెట్లమీద **Way to Rooms 80 to 90** అనే బోర్డుంది. అట్లాగే నెంబరు నూటరెండు పక్కనే వున్న మెట్లుమీద **Way to Rooms 91 to 100** అనే బోర్డుంది.

లాంజ్‌లో అయిదారు కుర్చీలూ+ఒక టీపాయి వున్నాయి. రాంబాబు నిలబడి వున్నాడు! అతను చాలా ట్రిమ్ముగా వున్నాడు. అతని చేతిలో ఒక వస్తువుంది. అతను ప్రేక్షకుల నుద్దేశించి అంటున్నాడు]

రాంబాబు: అందరికీ వందనాలు. ఇండియాలో అడుగుపెట్టి రెండురోజులయింది. ఈ హోటల్లో దిగి అరగంట గడిచింది. ఈ దేశం వదిలి ఆస్ట్రేలియాలో నాలుగేళ్ళున్నాను. పై చదువులకోసం వెళ్ళేనక్కడికి. అక్కడ నేనేం చదువుకున్నానో, ఏం సాధించానో తమకి చెప్పుకోవాలని తొందరగా వుంది.అంతకంటే ముందు నేను కనిపెట్టిన 'నథింగ్ బట్ ట్రూత్'ని మీ అందరిముందు.... ఇక్కడే....ఈ హోటల్లోనే ప్రయోగించి-దాని రిజల్టేమిటో మీ ముందుంచి మీరు మెచ్చుకుంటే పొంగిపోదామని ఎంతో ఆశగా వుంది.

[బోయ్ కుడివేపు మెట్లమీంచి దిగివస్తున్నాడు. అతన్ని చూడగానే తన చేతిలో వస్తువుని కనపడకుండా దాచేసి మాటలాపుజేసేడు]

బోయ్: గుడ్‌మార్నింగ్ సార్!
రాంబాబు: గుడ్‌మార్నింగ్!
బోయ్: ఎవరైనా ఫ్రండ్సుగాని రావాలా సార్?
రాం: వండ్రఫుల్! ఎట్లా కనిపెట్టేవు?
బోయ్: గది విడిచి లాంజ్‌లో తిరుగుతున్నారంటే ఎవరికోసమో వెయిటింగ్‌లో వున్నారని ఈజీగా చెప్పచ్చు సార్!
రాం: నీది చాలా షార్ప్ బ్రెయిన్!
బోయ్: థేంక్యూ సార్....

(కులుకుతూ వెళ్ళిపోయేడు బోయ్.రాంబాబు ప్రేక్షకుల్తో అంటున్నాడు.)

రాం: నా చేతిలో వున్న ఈ వసువుని చూడండి. ప్లీజ్ హేవె గ్లాన్స్ ఎట్ దిస్! (చూపించేడు) పాకెట్ ట్రాన్సిస్టరులాగా వుంది కదూ? కానీ, ఇది ట్రాన్సిస్టరు కాదు. నేను కనిపెట్టిన ఇన్‌స్ట్రుమెంట్. దీనికి 'నథింగ్ బట్ ట్రూత'ని పేరు పెట్టేను. దీనివల్ల ఏం ప్రయోజనమని సహృదయులు అడగొచ్చు. అయ్ విల్ ఎక్స్‌ప్లైన్. ప్రపంచంలో అబద్ధం ప్రతి

## గమనిక:

ఈ నాటికను మిత్రుడు నెమలికంటి రాధాకృష్ణమూర్తి (శ్రీకళానిలయం, రామచంద్రపురం, హైదరాబాదు) కోసం రాసేను. ఇతరులు ప్రదర్శించాలనుకుంటే మూర్తికి తెలియజేయడం మంచిది.

ప్రదర్శనకాలం గంటకి తక్కువైతే నాటికనీ, రెండూ రెండున్నర గంటలు నడిస్తే నాటకమనీ పరిషత్పోటీ రూలు. నాటికగా రాద్దామనే కూచున్నాను. రాస్తున్నప్పుడు ఉత్సాహం ఎక్కువై గీత దాటి నాటకం పొలిమేరల్లోకి వచ్చి ఆగింది. ఇంకో సీను రాస్తే నాటకమే అయ్యేది. ఆ ప్రయత్నం ఇప్పట్లో చేయాలనిలేదు. పోటీల్లో దీన్ని నాటికగా ప్రదర్శించాలనుకుంటే కొన్ని డైలాగులు తప్పకుండా తీసేయాలి. నా చేతుల్తో ఆ పని చేయడం నా కిష్టంలేదు. ఆ భావం ప్రదర్శకులకే వదిలేస్తున్నాను.

పోటీల్లో గాకుండా మామూలు సందర్భాల్లో అయితే పూర్తి స్క్రిప్టుని ఆడుకోవచ్చు. కేవలం చదవడానికైతే బైంతో ఎల్లాంటి ఇబ్బందీ వుండదని నమ్ముతున్నాను.

—రచయిత.

అంగుళం రాజ్యం చేస్తోంది. నిత్య జీవితంలో ముప్పావు వంతు అబద్ధంలోనే బతుకుతున్నాం. 'సత్యం వద' అని మహర్షులు, శాస్త్రాలూ, చివరికి దేవుళ్ళు చెప్పినా వుయ్ డోంట్ కేరిట్. తాతలు దిగొచ్చినా నిజం చెప్పని ఘనాపాటీలు మన ఎరికలో ఎంతోమంది వున్నారు. వాళ్ళచేత నిజం చెప్పించడమే దీని ప్రయోజనం. దీన్ని ఆన్ చేసి మీ జేబులో పెట్టుకోవచ్చు. పక్కవాడికి అంటించవచ్చు. మంచానికి తగిలించవచ్చు. గుమ్మానికి వేలాడదీయవచ్చు. ఎక్కడైనా వుంచండి. మీ ఇష్టం. ఇదెక్కడుంటే అక్కడ నిజమే వినిపిస్తుంది. పచ్చి కోతలరాయుడు సైతం ఇది ప్రొడ్యూస్‌చేసే ఎలక్ట్రానిక్ రేస్‌వల్ల మనిషి ఉన్మత్తావస్థలో పడిపోతాడు. ఎంత కాదనుకుని ఎంత గింజుకున్నా ఆ మనిషి పరమ సత్యాలే చెబుతాడు తప్ప అక్షరం అబద్ధమాడలేడు. ఇదంతా ఏదో ఫెంటాసిక్ నాన్‌సెన్సనీ, మహోటని తీసిపారేయకండి. ఇక్కడ కొత్తయినా పొరుగు దేశాల్లో ఇల్లాంటి ఇన్వెన్షన్స్ జరుగుతున్నాయని మీరు పేపర్లలో చదివే వుంటారు. ఆల్‌రైట్.... దీన్ని—

[చుట్టూతా చూసేడు. కుర్చీల్లో ఒక కుర్చీ మీద అతని దృష్టి నిలిచింది. అటువేపు తిప్పుతూ అన్నాడు]

రాం: అదుగో....ఆ కుర్చీకి తగిలిస్తాను.

[అని అక్కడికి వెడుతుండగా బోయ్ కొంత లగేజీ మోసుకొస్తూ అన్నాడు.]

బోయ్: సార్....మీరిట్లా నిలబడితే బావుండదు సార్. నమస్కారం చేయండి!

రాం: (తన ప్రయత్నానికి వాయిదా వేసి అడిగేడు) నమస్కారమా?

బోయ్: అవునుసార్! రెండు చేతులూ జోడించి నిలబడాలి.

రాం: ఎవరికి? నీకా?

బోయ్: నాక్కాదు సార్! నా వెనకొస్తున్నారు. ఆయనకి! నమస్కారాలంటే చాలా యిష్ట మాయనకి. ఆయనొచ్చేవేళకి నమస్కారం చేస్తూ కనిపిస్తే ఎంతో ఆనందిస్తారు.

రాం: (కొంచెం కోపంగా) వాట్ నాన్‌సెన్స్ యూ ఆర్ స్పీకింగ్? ఆయనెవరో ఏమిటో తెలీకుండా—

[ఆ వ్యక్తి రానేవచ్చేడు. బరువుగా ఠీవిగా నడుచుకుంటూ వచ్చి బోయ్‌తో అన్నాడు]

వ్యక్తి: నా కిచ్చిన గది నెంబరెంత నాయనా!

బోయ్: ఎయిటీవన్ సార్!

వ్యక్తి: మరిక్కడ నిలబడ్డావే?
బోయ్: వెళ్ళిపోతున్నానుసార్!

[అంటూ కుడివేపు మెట్లెక్కి వెళ్ళిపోతున్నాడు]

వ్యక్తి: (చేతులు జోడించి అన్నాడు) ఇందాక నాకు నువ్వు నమస్కారం చేసేవు కదూ? చూసుకోలేదు!

రాం: (మరింత ఆశ్చర్యంగా) నేను....మీకు?

వ్యక్తి: (నమస్కారముద్ర తొలిగించేసి అన్నాడు) వదిలెయ్. అవునూ నిన్నెక్కడో చూసిన గుర్తు?

రాం: మాది ఈ ఊరుకాదు!

వ్యక్తి: ఆ మాటకొస్తే మాదికూడా ఈ ఊరు కాదు. నిత్యం ఎన్నోవేల లక్షల ప్రజల్తో సంబంధం మాకు. ఎందర్నని గుర్తుంచుకుంటాను చెప్పు? మనిషికి ఏశక్తి వున్నా ఏది లేకపోయినా జ్ఞాపకశక్తి మాత్రం చాలా అవసరంరా కుర్రాడా అనేవారు టంగుటూరి ప్రకాశంగారు. రాజమండ్రి జైల్లో నాతోపాటు అర్నెల్లున్నారు పంతులుగారు.

రాం: వారిగురించి విన్నాననుకోండి. మీరెందుకు జైలుకు వెళ్ళేరో....

వ్యక్తి: అంటే?నే నొకందుకూ, వారొకందుకూ వెళ్ళి అక్కడ ఇద్దరం కలుసుకున్నామని డవుటుపడుతున్నావా? పిచ్చివాడా-వారెందుకు వెళ్ళేరో నేనూ అందుకే వెళ్ళేను. జేబులు కొట్టిగానీ మేము జైళ్ళకు వెళ్ళలేదు నాయనా! దేశం.... దేశంకోసం లాఠీదెబ్బలు తిన్నాం. జైళ్ళకు వెళ్ళేం. అర్జంటుగా ఫోన్ చేయాలి. వస్తా!

[వెళ్ళబోయి ఆగి అన్నాడు]

వ్యక్తి: కంగారుపడకు. నేనెవర్నో ఏమిటో తెలుసుకోవాలనుంటే బోయ్ వస్తాడు. వాడిని అడిగి తెలుసుకో!

[వ్యక్తి తన రూమ్‌కోసం మేడ ఎక్కేడు. అతను వెళ్ళిపోయేంతవరకూ చూస్తూ నిలబడి ఆ తర్వాత ప్రేక్షకుల్తో అన్నాడు]

రాం: పానకంలో పుడక. ఈ ఇన్‌ట్రప్షన్ని పట్టించుకోవద్దు. నవ్—(కుర్చీని తాకుతూ) ఇదొక కుర్చీ. చెక్క కుర్చీ. ఈ కుర్చీకి 'నథింగ్ బట్ ట్రూత్'ని బిగిస్తున్నాను. హేవె లుక్!

[కుర్చీ కింద దాన్ని బిగించేడు]

రాం: బిగించినంత మాత్రాన సరిపోదు. యాక్షన్లో వుండాలంటే స్విచ్ ఆన్ చేయాలి. (చేసేడు) ఇటీజిన్ యాక్షన్ నవ్! ఇదిప్పుడు ఆఫ్టరాల్ చెక్కకుర్చీ కాదు సత్యపీఠం.

[ఎవరో వస్తున్న అలికిడి అయ్యింది. రాంబాబు కుర్చీకి దూరంగా కదిలేడు. బోయ్ దిగివచ్చి మాటా పలుకూ లేకుండా రాంబాబుని చూస్తూ ఒక్కో అడుగు వేస్తున్నాడు. రాంబాబుకి అతని చర్య ఏమిటో అర్థంకాలేదు. అందుచేత అతని దృష్టి మళ్ళించేందుకు ఒకపక్కకి కదిలేడు. మళ్ళా అటువేపు వచ్చి నించున్నాడు బోయ్. రాంబాబుకి విసుగు కలిగింది.]

రాం: వాటీస్ దిస్?

బోయ్: (బదులివ్వలేదు. మనిషిని గుచ్చిగుచ్చి చూస్తున్నాడు)

రాం: నీకేం పిచ్చెక్కలేదుగదా!

బోయ్: లేదు సార్!

రాం: మరెందుకట్లా పిచ్చిచూపులు చూస్తున్నావు?

బోయ్: నన్నేమైనా అడగాలని మీకు అనిపించడంలేదా సార్!

రాం: ఏ విషయం....ఎవర్ని గురించి?

బోయ్: అదే! దీనబంధుగారి గురించి సార్!

రాం: దీనబంధెవరు?

బోయ్: ఇందాక మీతో మాట్లాడి వెళ్ళారే.... ఎయిటీవన్—

రాం: ఓహో! ఆయనా?

బోయ్: (ఆనందంగా) అవును సార్! ఆయనే! ఆయన గురించి నన్నేమైనా అడుగుతారా సార్?

రాం: నాకేమిటవసరం?

బోయ్: అమ్మో! అట్లా అనకండి సార్! మీరడగాలిసార్. నేను చెప్పాలి సార్.

(అయిదు రూపాయల నోటు తీసి చూపెడుతూ అన్నాడు) వారి గురించి మీకు సమస్తం చెప్పమని ఇదిచ్చేరు సార్! మీరడక్కపోతే ఈ ఫీజు నాకు దక్కదు సార్!

రాం: ఇటీజ్ నాన్ సెన్స్! షీర్ నాన్ సెన్స్!

బోయ్: ఈ అయిదూ నాకు దక్కాలంటే మీ రడక్కపోయినా చెప్పేస్తాను సార్! (నోటు జేబులో వేసుకుని ఠీవిగా చెప్పేడు) ఆయన ఎం. ఎల్. ఏ.గారు. అసలు పేరు కనకారావు. వాళ్ళ పార్టీ వాళ్ళు ఆయనకు దీనబంధు అని బిరుదిచ్చి సన్మానం చేసేరు. అప్పట్నుంచి అసలుపేరు ఆయన్తోపాటు జనం కూడ మరిచిపోయేరు. దీనబంధు అనే పిలుస్తుంటారు. ఆ పేరుతో పిలుస్తేనేగాని ఈయన పలకరు.

[బజర్ వినిపించింది]

బోయ్: కమింగ్ సార్!

[అంటూ బయటకి వెళ్ళిపోయేడు]

రాం: ఇటీజ్ పెక్యూలియర్! (మూడు మార్చుకుని అన్నాడు). ఇంక మన కథలోకి వచ్చేద్దాం. ఆ కుర్చీని గుర్తుంచుకోండి. దానిమీద కూర్చున్నవాడు—ఆ వ్యక్తి ఎవరైనా కావచ్చు. ఎంత లౌక్యుడైనా కావచ్చు. దానిమీద కూర్చుంటేమాత్రం హి విల్ బి అవుట్! ఆ మెషిన్ పవర్ కి అతని మెదడు అంకితమవుతుంది. అప్పుడు లోపలి మనిషి బయటకి వస్తాడు. అన్నీ నిజాలే....పచ్చి నిజాలే పలుకుతాడు.

[బోయ్ మరికొంత లగేజితో వచ్చి ఎడమ వేపు మెట్లెక్కుతున్నాడు. ప్లీడరు ప్రవేశించి గుమ్మం దగ్గిరాగి ఎవర్తోనో చెబుతున్నాడు]

ప్లీడ: కారు తీసుకెళ్ళిపోండి. బస్టాండ్ కి కారు పంపినందుకు ధనకోటికిగారికి థేంక్స్ చెప్పండి. వారికోసం వెయిట్ చేస్తుంటానని కూడ చెప్పండి. ఓ. కె? దట్స్ గుడ్! (గాల్లో చెయ్యూపి అన్నాడు) బోయ్!

బోయ్: (ఆగి అన్నాడు) సార్!

ప్లీడ: రూంనెంబర్ నైన్టీత్రీ!

బోయ్: ఇదే సార్ దారి! రండి!

ప్లీడ: పద పద!

[వాళ్ళిద్దరూ ఎడంవేపు మెట్లెక్కి వెళ్ళిపోయేరు. రాంబాబు ప్రేక్షకులతో అంటున్నాడు]

రాం: సో! ఎవరిథింగ్ ఈజీ రెడీ నౌ! నేను నా గదిలో కాలక్షేపం చేస్తాను. మీరిక్కడ జరిగే తంతుని గమనిస్తుండండి.సీ యూ అగైన్?

[రాంబాబు....తన గది నూటఒకటిలోకి వెళ్ళబోతుండగా కానిస్టేబిల్ వచ్చి సెల్యూట్ చేసి అన్నాడు]

కాని: నా పేరు అప్పల్సామండి. ఇంటి పేరు నిప్పండి. టూటవున్లో పనిచేస్తున్నానండి. తమకోసం వచ్చేనండి!

రాం: (ఉలిక్కిపడ్డాడు) నాకోసమా?

అప్ప: అయ!

రాం: నేనెవరో....ఏమిటో....

అప్ప: అప్పల్సామి పవరెంటో తమకు తెలవదులాగుందండి. టవున్లో ఎవర్నడిగినా చెబుతారండి. తమర్ని చూసుకోమని యస్సైగారు నన్ను పంపించేరండి.

రాం: యస్సైగారు—

అప్ప: యస్సైగారంటే యస్సైగారు కాదనుకోండి. ఆరు హెచ్ సికి చెపితే హెచ్ సిగారు నాకు సెలవిచ్చేరండి.

రాం: అది సరేనయ్యా! నన్నే చూసుకోమని....

అప్ప: ఇంకొద్దండి! మడుసుల్ని పోల్చుకోడంలో అప్పల్సామి తర్వాతే ఎవరైనానండి! తమకేం కావాలో ఆడరేయండి. వరేంజిమెంట్లు చేసేస్తానండి.

రాం: నన్నెవరనుకుంటున్నావో....

అప్ప: తర్టీ ఇయర్స్ సార్వీసండి. కళ్ళకి మెదడికి పవరెక్కువండి. పెద్దోళ్ళు చెప్పింది చాకులాగా చేసుకుపోడం మొదట్నుంచీ అలవాటండి. డూటీలో నిప్పండి. అదే ఇంటిపేరండి. ఊళ్ళో

వోళ్ళకి పులండి.

రాం: ఇట్సాల్‌రైట్....ఇప్పుడు నాతో ఏం పనో చెప్పు?

అప్ప: తమ పేరు శంకరంగారండి. తమరిక్కడ దిగుతారని ఇన్‌ఫర్మేషనండి. తమర్ని—

రాం: ఆగాగు! నా పేరు శంకరం కాదు. రాంబాబు!

అప్ప: (దెబ్బతిన్నాడు. దాచుకున్నాడు) తమరు వాల్తేరునుంచి వచ్చేరండి!

రాం: లేదు. బొంబాయినుంచి వచ్చేను.

అప్ప: (మరింత దెబ్బతిన్నాడు. మరింత దాచుకున్నాడు) తమరిక్కడ టూడేసుంటారండి!

రాం: కాదు. ఇవాళ సాయంత్రమే వెళ్ళిపోతున్నాను.

అప్ప: (బెంగగా) తమరు యస్సైగారి మేనల్లుడుగారండి?

రాం: నా కసలు మేనమామలే లేరు.

అప్ప: (రోషం వచ్చింది) అంతేనంటారాండి! అయితే సరేనండి. మీ డూటీ ఏంటో మీరు చూసేసుకోండి. నా డూటీ నేను చూసుకుంటానండి.

[రాంబాబు నూటఒకట్లోకి వెళ్ళిపోతున్నాడు. కానిస్టేబిలు కుర్చీలవేపు వస్తున్నాడు. బోయ్ మేడదిగుతూ అప్పలస్వామిని పలకరించేడు.]

బోయ్: గుడ్‌మార్నింగ్ గురుగారూ!

[బోయ్‌ని చూసుకోకుండా—అలవాటు కొద్దీ—సెల్యూట్ కొట్టేసేడు. ఆనక చూసి చాలా ఫీలైపోయేడు. పెద్ద పోజొకటి పెట్టి సీరియస్‌గా అడిగేడు]

అప్ప: ఏంట్రా? ఏంట్రా కూసేవ్?

బోయ్: గుడ్‌మార్నింగ్ గురూగారూ అన్నాను. తప్పేంటండీ?

అప్ప: గుడ్‌మార్నింగ్ వొరకూ సరిపెట్టుకుంటావ్రా? అందులో తప్పులేదు. ఆ తర్వాత ఏం కూసేవని అడుగుతున్నాను.

బోయ్: గురూగారూ అన్నాను. అంతేకదా?

అప్ప: (కోపంగా) కొరికేస్తాన్రోయ్! అప్పడం నమిలినట్టు నమిలేస్తాను. డూటీలో వున్నాను. కాపడ్డంలేదా? ఇట్టాంటప్పుడు గురూ గిరూ అని గీరగా పిలిచేవంటే తినేస్తాను జాగ్రత్త! అసలు నా పేరేంట్రా?

బోయ్: అప్పలసామి!

అప్ప: అంతవొరకూ కరక్టే! మన ఇంటి పేరు చెప్పు!

బోయ్: సొరకాయలండి!

అప్ప: ఏంట్రా? సొరకాయలా?

బోయ్: మా ఇంటిపేరు అదేనండి మరి.

అప్ప: నిన్నడిగింది మనింటి పేరురా! మన అంటే అర్థం కాలేదా? నేను. నా ఇంటి పేరు చెప్పు!

బోయ్: నిప్పు!—

అప్ప: అద్గదీ! అట్లా రా దారికి! ఇప్పుడు మన పూర్తిపేరు చెప్పు.

బోయ్: సొర—


అప్ప: (కోపంగా) తింటాన్రోయ్. కరిచేస్తాను. మన అంటే అర్థమేమిటో ఇందాకే చెప్పేను.

బోయ్: నిప్పు అప్పలసామండి!

అప్ప: అవునా? నిప్పు అప్పలసామంటే ఏంటనుకున్నావురా? నిప్పన్నమాట. అంటుకుంటే కాల్తాను జాగర్త? అల్లాటప్పా గాడ్ని కాదురా? నిప్పు. నిప్పంతే! గేంబ్లింగ్‌గాళ్ళని దొక్కలో పొడిచేను. బ్రోతల్సని బొక్కలో తోసేను. జేబులు కొట్టే యెదవల్ని ఏరి పారేసేను. పదీ పాతికా చేతిలోపెట్టి తప్పుకోవాలనుకున్న కేటిగాళ్ళని కరకరా నమిలి మింగేసేను. నన్ను గురూ అంటావురా? నీ లెవలేంటి నా లెవలేంటి? సారను. ఏంటి అర్థమైందా?

బోయ్: అర్థమైంది సార్!

అప్ప: (ఖుషీగా) యెదవంట యెదవ! బతికిపోయేవు పో! నా పైనోడు నన్నెట్లాగూ సారనడు. నా కిందోడు కూడా సారనక పోతే నాకేంట్రా మరియాదా? ఎల్లెల్లు.




నీ డూటీ నువ్ చూస్కో - పో!

[బోయ్ బయటకు వెళ్ళిపోతున్నాడు. లాఠీ నేలమీద కొడుతూ తీవిగా తిరుగుతున్న అప్పల సామికి ఎం. ఎల్. ఏ. దిగిరావడం కనిపించింది. లాఠీ చంకలో పెట్టి ఆ చేత్తోనే సెల్యూట్ కొట్టేడు. చంకలో లాఠీ కిందపడిపోయింది. సెల్యూట్ మాత్రమే మిగిలిపోయింది.]

దీన: నీ పేరు అప్పలసామి కదూ?

అప్ప: నిప్పండి! నిప్పు అప్పలసామి!

దీన: నీ ప్రమోషను ఏవయ్యిందీ?

అప్ప: ఆయ! అదింక రాదండి!

దీన: అదేం మాటోయ్?

అప్ప: (వినయంగా చెప్పినా లౌక్యంగా అన్నాడు) డూటీలో నిప్పు కదండి మరీ! ప్రమోషను రాదండి. తవకు తెలీందేముందండీ.... ఆనెస్టుగా బతికే వోడికి ప్రమోషన్లు రావండి. ప్రమోషనో ఆనెస్టో ఏదో ఒకటి కోరుకోవాలండి. నేను ఆనెస్టుని కోరుకుని ఇట్లాగై పోయేనండి!

దీన: ఛూడు నాయనా నిప్పు _ అప్పలసామీ!

అప్ప: ఆయ!

దీన: ఆనెస్టీని ప్రతి ఒక్కడూ నమ్ముకు బతకాలి.

అప్ప: అదే గదండీ నేను చేస్తోంది!

దీన: ఆనెస్టీని విసుక్కునే అమాయకులంతా వట్టి వాజమ్మలని లంబోదరన్ నాతో అన్నాడు.

అప్ప: లంబోదరనా? ఆయ నెవరండీ!

దీన: ఈ రాష్ట్రంలో నేనేమిటో తమిళదేశంలో లంబోదరనూ అంతే! చంగల్‌పట్టు జైల్లో మేమిద్దరం నాలుగు వారాలు కలిసి వున్నాం. ఇప్పుడాయన లేడు. శిలావిగ్రహం కట్టించే రక్కడ. నేనింకా వున్నాను. నేనుండగానే శిలా విగ్రహం ఏర్పాటు చేయించాలనుకుంటున్నా రిక్కడ. ఈ విగ్రహాల డిఫరెన్స్ తీసేస్తే మా ఇద్దరికీ చాలా దగ్గిర పోలికలున్నాయి.

అప్ప: ఆయ! చిత్తం!

దీన: నాకు మంత్రి పదవి కట్టబెట్టాలని మా వాళ్ళంతా పట్టుబడితే వద్దు పొమ్మన్నానోయ్!

అప్ప: నేనూ అంతేగదండీ మరి! ప్రమోషను వద్దనే సేను!

దీన: మంత్రి పదవిలో ఆనెస్టీ ఆట్టే ఎక్కువ వుండదని గాంధీగారు తమ ఆత్మకథలో రాసుకున్నారు. ప్రజలకు మరింత ఇతోధి

కంగా సేవచేసి చరిత్రలో నిలిచిపోవా లంటే ఆనెస్టీ చాలా అవసరమన్నాడు గుల్‌బహార్‌సింగు!

అప్ప: ఈ సింగుగా రెవరండీ?

దీన: గాంధీగారికి కుడిభుజం. వదిలెయ్. మంత్రి పదవిలో వుంటే నా ఆనెస్టీ దెబ్బతిం టుందనే భయంతో ఎం. ఎల్. ఏ. గానే వుండిపోతున్నాను.

అప్ప: (మొహమాటంగా చెప్పినా ఖచ్చితంగా అన్నాడు) ఏంటో అనుకున్నాను గానీండీ....డీప్‌గా ఆలోచిస్తే తమ కున్న గుణాలే నాక్కూడా వున్నా యండి!

దీన: ఉంటాయ్ నాయనా! ప్రజాసేవకి ప్రతి నిధులం మనం. మనకి ఆనెస్టీ వజ్ర కవచం. ప్రమోషన్లు రాకపోవచ్చు.... పదవులు లేకపోవచ్చు. ఆనెస్టీఆనెస్టీయే!

అప్ప: చిత్తం! చాలా మంచి విషయాలే చెప్పే రండి!

దీన: మరి వస్తానోయ్! కింద కారుంది. ప్రజలు నాకోసం వెయిట్ చేస్తున్నారు. వాళ్ళ సేవకే అంకితమైపోయేను గదా! వాళ్ళ కెల్లాంటి సేవ చేయాలో కనుక్కొని మళ్ళా వస్తా!

[అప్పలసామి మళ్ళా సెల్యూట్ కొట్టేడు. ఆ దెబ్బకి రొమ్ము విరుచుకుని అడుగువేసేడు దీనబంధు.

ఇప్పుడు శంకరం, సుగుణలు ఒకర్నొకరు పెనవేసుకుని వస్తున్నారు. వాళ్ళని చూడగానే చేతులు జోడించేడు దీనబంధు. సుగుణ భర్త నుంచి దూరంగా జరిగి, వెంటనే ప్రతి నమ స్కారం చేసింది. శంకరం యింకా నమ స్కారం చేయకపోవడంతో దీనబంధు దిగులు పడిపోతూ నమస్కార ముద్రని శంకరంవేపు తిప్పేడు. శంకరం—ఇక తప్పదన్నట్టు— చేతులు జోడించేడు.

అప్పటిగ్గాని నమస్కార యుద్ధం ముగి సింది కాదు. దీనబంధు సుగుణవేపు చూస్తూ అన్నాడు]

దీన: నీ పేరేమిటమ్మా?

సుగు: సుగుణండి!

దీన: అవునూ— నిన్నెక్కడో....ఎప్పుడో చూసినట్టు జ్ఞాపకం తల్లీ! ఎక్కడబ్బా?

సుగు: (సగ్గుపడుతూ) మా పెళ్ళికి వచ్చేరండి! (శంకరంతో) దీనబంధుగారని ఎం. ఎల్. ఏ.గారు. (దీనబంధుతో) మా వారండి!

దీన: ఇంక చాలు. మొత్తం గుర్తుకొచ్చేసింది. మీది బొబ్బర్లంక కదూ?

సుగు: కాదండి! కాకినాడ!

దీన: కాకినాడా? అట్లా చెప్పు! సుందర్రామయ్య గారమ్మాయివి—

సుగు: నాన్నారిపేరు సుందర్రామయ్య కాదండి. సూర్యారావుగారు.

దీన: సూర్యారావుగారా? అవునవును. సూర్యా రైస్‌మిల్లని మీకు రైసు మిల్లొకటి వుందికదూ?

సుగు: కాదండి. నాన్నారు కంట్రాక్టులు చేస్తుం టారు. లారీలుకూడా వున్నాయ్.

దీన: ఓహోహో! ఆయనా! అవునవును. ఆయన్నాకు బాగా తెలుసు. బావుంది. హనీమూన్‌లో వున్నారన్నమాట.

సుగు: లేదండి. మావారి ఊరు వెడుతూ ఇక్కడాగేము. ఈ ఊళ్ళో మా వారికి చాలామంది ఫ్రండ్సున్నారు.

దీన: భేష్. బావుంది. మళ్ళా వస్తాను. నేను కూడా ఇదే హోటల్లో ఎనభైఒకటిలో ఉంటున్నాను. మళ్ళా కలుద్దాం. (శంక రంతో) వెళ్ళొస్తానోయ్!

శంక: మంచిదండి (దీనబంధు వెళ్ళిపోయేడు. శంకరం తల బాదుకుంటూ అన్నాడు) పాడు నస. ప్రాణాలు తీసేడు.

సుగు: పోన్లేండి పాపం! పెద్దవారు! ఎంద రెందరో కలుస్తుంటారు. అందర్నీ ఎట్లా గుర్తుంచుకుంటారు?

శంక: ఇట్సాల్ రైట్! ఈ గొడవదేముంది గానీ....నేను యెక్కువగా వర్రీ అవు తోంది నీ గురించి!

సుగు: నా గురించా?

శంక: కాదా మరి? ఆయనకు సమాధానాలు చెబుతూ నువ్వెంత అలిసిపోయావో నాకు బాగా తెలుసు!

సుగు: మీరు మరీనండి! ఈ మాత్రం దానికే అలిసిపోతానా ఏమిటి?

శంక: ఫ్లయిట్‌లో వద్దమంటే నువ్వే వద్దన్నావు. గతుకులరోడ్డు. కారుప్రయాణం. మల్లెపూవులాటి నిన్ను ఈ పాడు ప్రయాణం వర్రీ చేసి వుంటుంది. సారీ సుగుణా....సో సారీ! క్షమించు!

సుగు: (ప్రేమతో అతని నోరు మూసింది) అమ్మో! అంత మాటనకండి. నేను వినలేను. కారులో వెడదామని నేనే అన్నాను. అందులో మీ తప్పేముంది?

శంక: తప్పా? తప్పున్నారా? నీ మాట పెడ చెవిని పెట్టి నిన్ను ఫ్లయిట్‌లో తీసుకు రావలసిన బాధ్యత నాకు లేదా? కాని సుగుణా....నీ మాటని కాదనే చొరవ నాకు లేదు. ఇకముందు రాదు!

[అతని మాటలకు సుగుణ బాగా కదిలి పోయింది. అతని చేతులు తీసుకుంది. మూడీగా తియ్యగా అంటోంది]

సుగు: ఏవండీ!

శంక: (పరవశుడయేడు) సుగుణా!

సుగు: మీరెంత మంచివారండీ!

శంక: నీకంటేనా సుగుణా!

[ఇద్దరూ ఒకరికొకరు దగ్గరైపోయేరు. అప్పలసామి కళ్ళని ఒకచేతో మూసుకుని మరో చేత్తో లాఠీని నేలమీద కొట్టేడు]

అప్ప: ఏమండోయ్! ఇది హోటలండి! పది మందీ వచ్చేపోయే హోటలండి; పడ గ్గది కాదండి. దూరమైపోవాలండి!

[భార్యాభర్తలు దూరమైపోయేరు. శంకరం చిరాగ్గా అన్నాడు]

శంక: మైండ్ యువర్ డ్యూటీ!

అప్ప: మిమ్మల్ని దూరంగా నుంచోబెట్టడం కూడా నా డూటీయేనండి! నా కిప్పుడు డూటీ గుర్తుచేయమాకండి! నిప్పైపోతాను!

శంక: నువ్వేమైపోతే మాకేమిటోయ్?

అప్ప: అమ్మో! అమ్మో! ఓయ్....ఓయ్‌నా? (రుద్రుడైపోయేడు) ఏవండోయ్.... మాటలు తిన్నగా రావాలండి! అనవసరంగా పోలీసుల్తో పెట్టుకోకూడదండి! గట్టిగా చూసేనంటే — నిప్పుగదండి మరీ—మాడిపోతారంతే!

శంక: (కోపం వచ్చింది. అప్పలసామిమీది కొస్తూ అన్నాడు) అట్లాగా? ఏదీ? నీ ప్రతాపం ఏమిటో చూపించవోయ్!

అప్ప: గీత దాట్తున్నారు!

శంక: (ఇంకో అడుగు వేస్తూ) ఇంకా దాటు తాను.

సుగు: (అడ్డు పడింది) ఏవండీ?

శంక: నువ్వు తప్పుకో సుగుణా! ఇతని ముచ్చ టేదో చూద్దాం!

అప్ప: (ఫోన్‌వైపు పరుగెత్తి, ఆగిపోయి అన్నాడు)చూడండి బాబూ....చూసేసు కోండి. టూటవున్‌కి ఫోన్ కొడతాను. జీపొస్తాది. అ చూసుకునేదేదో టూ టవున్ స్టేషన్లోనే చూసేసుకుందాం. (ఫోన్ ఎత్తేడు)

శంక: ఆ స్టేషన్లో యస్సై వుంటాడు. పిలు!

అప్ప: ఏంటీ? 'డు'నా?

శంక: అవును. 'డు'నే! అతన్ని పిలు!

అప్ప: ఆరుండరు. కూనీకేసుకెల్లేరు. (ఆగి అన్నాడు) అయినా ఆరి సంగతెందు కండీ మీకు?

శంక: అతన్నాకు మేనమామ!

అప్ప: (అకస్మాత్తుగా ఫోన్ పెట్టేసేడు)

శంక: ఏం? ఫోన్ పెట్టేసేవే?

[అప్పలసామి సెల్యూట్ చేసేడు. పాఠం ప్రారంభించేడు]

అప్ప: తమ పేరు శంకరంగారండి!

శంక: అవును.

అప్ప: తమరు వాల్తేర్నుంచి వచ్చేరండి!

శంక: అయితే?

అప్ప: తమర్ని చూసుకోమని యస్సైగారు చెప్పేరండి! ఆరేమో రేపొచ్చి తమర్ని కలుస్తామన్నారండి!

శంక: అయ్‌సీ!

అప్ప: అయ్యబాబో! అయ్‌సీ అనేస్తే నా బాదరిలీజైపోదండీ. తమరు మన్నించాలండి. ఈ సంగతి యస్సైగారికితెలిస్తే నండీ—నాకు ఉరిశిక్ష పడిపోద్దండి! ఆరు నిప్పండి బాబూ. డూటీలో తిరకాసొస్తే నమిలి మింగేస్తారండి! ఆ డెట్టాంటోడయ్యేది డొక్కలో పొడిచేస్తారండి. బాబ్బాబు—ఈ తప్పు కాయండి! (సుగుణతో) అమ్మా-తవరైనా చెప్పాలండి.

శంక: ఇప్పుడావిడ్ని విసిగించకు. తప్పయిందన్నావు గదా....అది చాలు. కింద లగేజి వుంది. బోయ్‌ని పిలిచి—

అప్ప: (గట్టిగా అరుస్తూ అక్కడ్నించి కదిలేడు) బోయీ....రేయ్ బోయీ....

[శంకరం సుగుణ నూటరెండులోకి నడిచేస. బోయ్ లగేజి మోసుకొస్తున్నాడు. అప్పలసామి లాఠీ ఊపుకుంటూ ఆర్డర్లు వేస్తున్నాడు.]

అప్ప: మెల్లిగా! బద్రం—జాగర్త! ఏ ఒక్క వస్తువైనా కిందపడిందో నా పంటికింద పడి నలిగిపోతావ్ జాగర్త!

[బోయ్ లగేజీని నూటరెండులోకి తీసుకు వెళ్ళబోయేడు. అప్పలసామి అరిచేడు]

అప్ప: ఆగక్కడ! అక్కడాగంతే! ఇక్కడ వొరకే నీ డూటీ. లోపల డూటీ నాది! ఏం టర్దమైందా?

[బోయ్ లగేజీని దించేడు. అప్పలసామి ఆ లగేజీని తీసుకుని 102 లోకి వెళ్ళివచ్చేడు. తలెత్తి చూస్తే బోయ్ నడ్డిన చేతులుంచుకుని నిలబడి అప్పలసామి పేపు విడ్డూరంగా చూస్తున్నాడు. అప్పలసామి గాండ్రించేడు.]

అప్ప: ఏంట్రా? ఆ చూపేంటి? ఆ పోజేంటి?

బోయ్: (సరిగ్గా నిలబడి గొణిగేడు) మా పని కూడా మీరే చేస్తుంటే....

అప్ప: (ఆనందంగా అన్నాడు) చేస్తాన్రా! సంతోషంగా చేస్తాను. ఆ రెవరనుకుంటున్నావ్? యస్సై బాబుగారి బందుగుల్రా సన్నాసి! యస్సై బాబంటే ఏంటనుకుంటున్నావ్? పరమేస్వరుడితో సమానం. పరమేస్వరుడే మారేషం కట్టుకుని సేషన్లో యస్సైగా ఎలిసేడు. జిల్లా మొత్తమ్మీద పెద్ద పేర్రా ఆయనకి! ఆనెస్టులో ఆయన ఫస్టు. నేను సెకండు. అట్టాంటి మహానుభావుడి బందుగులకి మూటలు మోయడమే కాదురా, నా చెర్మం వలిచి చెప్పులు కుట్టించి పళ్లెంలో పెట్టిచ్చినా తప్పులేదురా యెదవా! నేను నిప్పు. యస్సైగారు యమ నిప్పు. అందుకే....ఆరన్నా ఆరి మనుసులన్నా అంత భక్తి....ఇంత విస్వాసం! ఏం టర్దమైందా?

[ఈ మొత్తం మాటాడుతూనే అప్పలసామి సత్యపీఠంవేపు నడిచేడు. డైలాగు పూర్తయ్యే సరికి అతను ఆ కుర్చీదగ్గిర నిలబడ్డాడు]

బోయ్: అర్థమైందండి!

అప్ప: (సరదాగా అన్నాడు) ఏం టర్దమైందో చెప్పరా! ఇందారి!

(అని కుర్చీలో కూర్చున్నాడు. కుర్చీలో అప్పలసామి కూర్చోగానే అతని వళ్ళు జలదరించింది. మొహంలో రంగులు మారుతున్నాయి. పూర్తిగా అతను కుర్చీకి వశమైపోయేడు. బోయ్ సమాధానం చెబుతున్నాడు)

బోయ్: మీరు నిప్పైతే వారు యమ నిప్పన్నారండి!

అప్ప: ఏంట్రా? నేను—

బోయ్: నిప్పండి!

అప్ప: ఆరు?

బోయ్: యమ నిప్పండి!

అప్ప: నా సంగతేంటో తర్వాత చెబుతాగాని, ఆరంటే ఎవ్రా?


బోయ్: యస్సైగారండి!

అప్ప: ఆడ్ని గారన్నావంటే నిన్ను కూరొండుకొని తినేస్తా జాగర్త! ఎవడ్రా యస్సై.

బోయ్: పరమేశ్వరుడండి!

అప్ప: ఇంకో తడవ ఆడికి బిరుదిచ్చేవంటే నీ పేగు తీసి మెళ్ళో దండేసుకుంటా నేమనుకుంటున్నావో? ఆడు పరమే

## (వి) చిత్ర విజ్ఞానం




తల్లి పాలుకు నోచుకున్న పసివాడికి మాటలు త్వరగా రావడమే గాక మాట ఉచ్చారణలో లోపాలు అస్సలుండవని ఫ్రాన్సిస్ బ్రాడ్, న్యూజీలాండ్ మెడికల్ పత్రికలో పేర్కొన్నాడు. నూటముప్పై నలుగురు పసిపిల్లల్ని, వారి తల్లుల్ని పరీక్షించిన పిమ్మట యీ సంగతి తెలుసుకున్నాడు బ్రాడ్. పుట్టడంతోటే కనీసం ఏడువారాల వరకైన తల్లిపాలు తాగగలిగితే పిల్లవాడికి మాటలు చక్కగా వస్తాయి!

---

స్వరుడా? ఆడి సంగతి స్టేటంతా తెలుసున్రా? ఆకలెక్కువ్రా ఆడికి! అందిన కాడల్లా తినేయడం రూలాడికి. నెల చివర్లో వెయ్యి రూపాయల కేమాత్రం తక్కువైనా చిందులుతొక్కుతాడ్రా ఆడు! కన్న తల్లి కావచ్చు. కట్టుకున్న వైఫే కావచ్చు. డోంట్ కేర్ గాడు. చేయి జాపి జేబు చూపిస్తాడు. రేయ్—ఆడిల్లెప్పుడైనా చూసేవంట్రా నువ్వు?

బోయ్: (ఆశ్చర్యంగా వింటూ లేదన్నట్టు తలూపేడు)

అప్ప: ఒకపాలి ఎల్లి చూడు. బాల్చీ తన్నేసి సొర్గానికి యెల్లిపోయేవని దవుటు కలుగుద్ది. ఇంద్రుడు నేలమీదికి దిగి అద్దింటో కాపరం పెట్టేడని పేపరోళ్లు రాసేయాల్సిందే. అట్టా వుంటాదిరా ఆడిల్లు. ఆ ఇంటో ఆడి వైభోగం చూస్తుంటే కళ్ళు తిరిగిపోవాల్సిందే. ఆడి జీతం ఆడి సిగరెట్లకే చాలదు. మెరిసిపోతున్నాడంటే ఆడు నిప్పా? రెండుసార్లు వుద్యోగం పోయేది. ఎవుడెవుడ్నో సరిచేసి....ఎవుడెవుడికో లంచాలు గుప్పేసి నిలబెట్టుకున్నాడు. ఆడు నిప్పేంట్రా? ఆడ్నేకాదు, నన్ను కూడా సిప్పనొద్దు.

బోయ్: అదేంటండీ! మీ ఇంటి పేరు నిప్పు. మీరు నిప్పు!

అప్ప: రేయ్....రెచ్చగొట్టమాకు. పిచ్చికుక్కనై పోతాను.

బోయ్: ఆనెస్టులో చూసుకొన్నా మీకు మీరే సాటి!

అప్ప: ఎవడ్రా? నేను ఆనెస్టా? నేను ఆనెస్టయితే ఎప్పుడో వచ్చేది ప్రమోషను. అయినా ఒరే—ప్రమోష నెవడికొావాలి? చిల కొట్టుడు ముందు ప్రమోషనెంతరా? నేనెంత సంపాయించేనో నీకేమైనా తెలుసున్రా?

బోయ్: (తెలీదన్నట్టు తలూపేడు)

అప్ప: నా పెళ్లాం మెళ్ళో నగలు, నా మంచాలూ నా కంచాలు, ఒరే భోయ్‌గా—నీలాంటోళ్ళని నలుగుర్ని కొనేగలన్రా నేను! కొనేస్తే ఎంక్వయిరీ పెడతారని గుట్టుగా లాక్కొస్తున్నా! నేను నిప్పేంటి? ఆనస్టేంటి? రేయ్—ఉద్యోగం వూడిపోయినా రెండు తరాలు లాగించేగలన్రా! ముండల దగ్గిర కక్కుర్తి పడిందీ, చోరీ కేసులో నొల్లుకుందీ, రేడింగుల్లో గుంజుకుందీ, కేటిగాళ్ళని సరిచేసిందీ—తల్సుకుంటే దీనమ్మ మొగుడు హోటలు దీని పక్కనే

కట్టించేగలను. ఏం టనుకున్నావో—
[ప్లీడరు మెట్లమీదికొచ్చి బోయ్ అని పిలిచేడు. బోయ్, యస్సార్ అన్నాడు. అప్పలసామి లేచి నించుని తల పంకించేడు]

ప్లీడ: (బోయ్‌తో) బెల్లుకొట్టినా బెల్లంకొట్టిన రాయికిమల్లె కదలవే?

బోయ్: నాకు వినపళ్లేదు సార్!

ప్లీడ: మాలీష్‌వాడ్ని పిలుచుకురా! వళ్ళు పట్టించుకోవాలి!

[ప్లీడరు వెళ్ళిపోయేడు. బోయ్ వెళ్ళబోతూ ఆగి అప్పలసామివేపు విడ్డూరంగా చూస్తున్నాడు)

అప్ప: ఏంట్రా ఆ చూపు? కొత్తెదవని చూసినట్టు అ బెదురేంట్రా నీకు?

బోయ్: (నాన్చుతూ అన్నాడు) అబ్బే! మరేం లేదండి!

అప్ప: మాలీష్ పని కూడా నన్నే చూడమంటావా ఏంట్రా?

బోయ్: అందుక్కాదండి!

అప్ప: మరెందుకా యెదవ చూపని అడుగుతున్నాను!

బోయ్: ఇందాక మీ మీటింగు విన్నాను కదా! మతిపోయిందండి!

అప్ప: మీటింగా? మీటింగేంట్రా సన్నాసి?

బోయ్: ఒకసారి గుర్తు చేసుకోండి. జాతకాలన్నీ బయట పెట్టేసేరు.

అప్ప: ఏంట్రోయ్—మోళీగాని కడతన్నావా ఏంటి? తెలిసి మాటాడినా తెలవక మాటాడినా—నేనేది మాటాడినా నిప్పే. ఏం టర్ధమవుతుందా? నా మాట, నా చేత అన్నీ కూడా అనెస్టే! డూటీలో దేవుడున్నాడనుకుంటాను. డూటీనే కొల్చుకుంటాను. తప్పుడు మాటలు, యెదవ మాటలు, ఎంగిలి మాటలు మందగ్గిర లేవు. ఎల్లెల్లు. ప్లీడరుబాబు మాలీసోణ్ణి అట్టుకొచ్చేయమన్నాడు. ముందా పనేదో చూడు. పో!

[బోయ్‌కి యింకా మత్తు వదల్లేదు. బుర్రని చేత్తో కొట్టుకుంటూ వెళ్ళిపోయేడు. సుగుణ చీర చెంగుతో విసురుకుంటూ గదినుంచి బయటకు వచ్చింది. అప్పలసామి అటన్లో నించున్నాడు. శంకరం సుగుణకు విసిరేందుకు పేపరు తీసుకొస్తున్నాడు)

సుగు: అబ్బబ్బ! పాడు కరెంటు. అన్నిచోట్లా వుండి మన గదిలోనే పోయింది.

శంక: చిరాకుపడకు సుగుణా! అసలే నీ ఆరోగ్యం అంతంత మాత్రం.

[పేపర్తో విసురుతున్నాడు]

సుగు: పాపిష్టిదాన్ని. మిమ్మల్ని ఇబ్బందిపెడుతున్నాను.

శంక: (విసురుతూనే) ఇబ్బందా? నాటెటాల్! ఇట్స్ ప్లెజర్ టుమీ!

అప్ప: (వినయంగా కలగజేసుకున్నాడు) పేపర్తో గాలి తగలదేమోనండి. తమ సెలవైతే విసినకర్రలు తెస్తానండి.

శంక: అవేమీ అక్కర్లేదుగానీ నూటరెండులో కరెంటు ఫెయిలైందని రిసెప్షన్లో చెప్పు.

అప్ప: చిత్తం!

[అటెన్షన్ కొట్టి అక్కడ్నించి వెళ్ళిపోయేడు)

సుగు: (భర్త తనకి విసరడం నచ్చలేదు) ఇక చాల్లెండి. ఎవరన్నా చూస్తే బావుండదు....

శంక: (విసరడం ఆపి) బావుండకపోడానికిందులో తప్పేముంది సుగుణా!

సుగు: మీకే? మీ రలాగే అంటారు. మొన్నామధ్య సీతాదేవి మన గురించి ఏం కామెంట్ చేసేరో తెలుసా?

శంక: ఏవన్నారేమిటి?

సుగు: నేను మిమ్మల్ని కొంగున ముడేసుకుని తిరుగుతున్నానట!

శంక: నా మొగుడు నా యిష్టం అని గట్టిగా చెప్పి వుండాల్సింది.

సుగు: (దిగులుగా) మీరుకూడా నన్ను ఆ మాత్రమే అర్థం చేసుకున్నారన్న మాట?

శంక: (అయోమయంగా) సుగుణా!

సుగు: మిమ్మల్ని కొంగున ముడేసుకోలేదండి. నా గుండెల్లో దాచుకున్నాను.

శంక: (ఆనందంగా) సుగుణా!

సుగు: ఏ జన్మలో ఏ పుణ్యం చేసుకున్నానో మీరు నాకు భర్తగా లభించేరు. నా మీద మీకున్న అభిమానం, అనురాగం తలుచుకుంటూ నా అదృష్టానికి పొంగి పోతుంటాను.

శంక: నిన్ను భార్యగా పొందినందుకు నేను కూడా అదృష్టవంతుడినే సుగుణా! మనది జన్మ జన్మల అనుబంధం.

[పై డైలాగులు పూర్తయ్యేసరికి ఇద్దరూ దగ్గిరయ్యేరు. అతుక్కుపోయేంత దగ్గిరై పరవశంలో మునిగిపోయేరు.]

సుగు: ఏవండీ?

శంక: సుగుణా!

సుగు: ఏవండీ!

శంక: సుగుణా!

[అప్పలసామి వచ్చి అన్నాడు]

అప్ప: తమ గదిలోకి కరెంటొచ్చేసిందండి!

[ఇద్దరూ విడిపోయేరు. సుగుణ గదిలోకి వెడుతోంది. ఆమెను వెంబడిస్తున్నాడు శంకరం]

అప్ప: (ఏం చెప్పాలో తెలీక) నేనిక్కడే వుంటానండి!

[శంకరం ఆగిపోయాడు. ఏదో గుర్తుకు రాగా జేబులోంచి పదిరూపాయల నోటు తీసి యిస్తూ అన్నాడు]

శంక: లక్ష్మీటాకీసుకి రెండు టిక్కట్లు రిజర్వు చేయించు.

అప్ప: చిత్తం. ఫస్టుషోకి కొనమంటారా? సెకండుషోకా?

శంక: ఫస్టుషోలూ సెకండుషోలూ అమ్మగారికి పడవు. మేట్నీలే యిష్టం!

అప్ప: చిత్తం!

[శంకరం గదిలోకి వెళ్ళిపోయాడు. అప్పలసామి సెల్యూట్ కొట్టి వెళ్ళిపోయేందుకు వెనక్కి తిరిగేడు. అక్కడ ధనకోటి వెలిసేడు. ఆయన్ను చూడగానే మళ్ళా సెల్యూట్ కొట్టేడు]

ధన: ఏవయ్యా—ఈమధ్య బొత్తిగా కనిపించడంలేదు?

అప్ప: ఏం చెప్పమంటారండయ్యా! డూటీమీద డూటీ పడిపోతుందండి! గాలి పీల్చుకోడానిక్కూడా టైం లేదండి! తమరిలా దయచేసేరేంటండీ?

ధన: ప్లీడరుగారొచ్చేరంటేనూ—

అప్ప: ఆయ! ఆయన మేడమీద గదిలో దిగేరండి!

ధన: ఇంత హోటలు కట్టించేదేగాని లిఫ్టు దగ్గిర కక్కుర్తి పడిపోయాడు. అసలే గుండెజబ్బు. మేడెక్కకూడదని డాక్టరు చెప్పేడు.

అప్ప: (సత్యపీఠం చూపించేడు) తమరట్లా కూచోండి. నేనెల్లి ప్లీడరుబాబుని పిల్చుకొస్తాను.

ధన: చాలా సంతోషం.

(సత్య పీఠమ్మీద కాకుండా వేరే కుర్చీమీద కూర్చున్నాడు. టీపాయ్‌మీదున్న పేపరు తీసుకున్నాడు. క్షణంసేపు చదివేడు. ఈలోగా, అప్పలసామితోపాటు ప్లీడరు కూడా వచ్చేడు]

అప్ప: ప్లీడరుగారొచ్చేరండి!

ప్లీడ: నమస్కారం.

ధన: (లేచి నించున్నాడు) నమస్కారం.

అప్ప: మరి నాకు సెలవిప్పించాలండి!

ధన: మంచిది! ఒకసారి ఫేక్టరీకొచ్చి కనిపించు.

అప్ప: చిత్తం.

[అప్పలసామి ఇద్దరికీ సెల్యూట్ కొట్టి వెళ్ళిపోయేడు. ధనకోటి చదివిన పేపర్ని సత్యపీఠమ్మీద వేసేడు. మరో కుర్చీని చూపెడుతూ అన్నాడు]

ధన: కూచోండి!

ప్లీడ: (కూర్చున్నాడు) థేంక్యూ.

ధన: (తానుకూడా కూచుంటూ) యావత్తు మానవజాతిమీదే నాకు విశ్వాసం నశించిపోతోంది ప్లీడరుగారూ—

ప్లీడ: సత్యకాలపు మనుషులు గదా—దేనికీ తట్టుకోలేరు.

ధన: నా ఫేక్టరీలో పనిచేసే కార్మికుల్ని నా కన్నబిడ్డల్లా చూసుకునే స్వభావం నాది.

ప్లీడ: ఆ మాట మీరు వేరే చెప్పాలా ధనకోటి గారూ. మీరంటే ఏమిటో తెలిసిన ప్రతివాడికీ ఆ విషయం తెలుసు.

ధన: అవునాండి. అట్లాంటి నామీద సత్యం మర్డర్ కేసు బనాయించేరంటే ఈ ప్రపంచాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలో నాకు తెలీడంలేదు.

ప్లీడ: ఒక్కమాట చెబుతాను. వింటారా?

ధన: చెప్పండి!

ప్లీడ: లోకంలో న్యాయం, అన్యాయం కవల పిల్లలకు మల్లె పక్క పక్కనే బతుకుతున్నాయి. ధర్మం అధర్మం కూడా తోబుట్టువుల్లా పెరుగుతున్నాయి. తాత్కాలికంగా కలతపెట్టినా అంతిమ విజయం ధర్మానికీ న్యాయానికే వుందని శాస్త్రాలు చెప్పేయి. కోర్టులు నిరూపిస్తున్నాయి. మీరేం బెంగపడక్కర్లేదు. న్యాయం మీ పక్షాన వుంది. మీ తరఫున వాదించేందుకు నేనున్నాను.

ధన: (కళ్ళజోడు తీసేడు. విచారంగా అంటున్నాడు) సత్యం నా బిడ్డలాంటివాడు. ఇంతప్పట్నించీ మా ఇంటోనే పెరిగేడు. మా పిల్లల్తో అడుకున్నాడు. యూనియన్ నాయకుడైతే కావచ్చుగానీ సత్యం నా ప్రాణమండి. యూనియన్ గొడవల్లో జోక్యం కల్పించుకొని నామీద వాడెన్నిసార్లు తిరగబడినా నేను వాణ్ని పల్లెత్తుమాటనలేదు. వర్కర్లంతా నా బిడ్డలతో సమానమనుకునే మనిషిని. పిక్నిక్‌లకూ, పిప్పరమెంటులకీ నా సొంతపిల్లలు నన్నెంత విసిగిస్తారో—జీతాలు పెంచమనీ, బోనస్‌లు ఇవ్వమనీ వర్కర్లుకూడా మారాం చేస్తారని సరిపెట్టుకున్నానే కానీ వాళ్ళమీద కక్షసాధింపు చర్యలకు నేనెప్పుడూ సిద్ధపడలేదు. అట్లాంటి నేను....నా సత్యాన్ని చంపుకుంటానండీ?

ప్లీడ: అనవసరంగా మనసుపాడు చేసుకోకండి. మీ ఆరోగ్యంకూడా....

ధన: (నిట్టూర్పుతో) హు....ఆరోగ్యం! చెట్టులాంటి సత్యం పోయింతర్వాత నా ఆరోగ్యం ఏమయితే ఏం కావాలండీ? ఎవరు చెడగొట్టేరో....ఎందుకు చెడగొట్టేరోగాని బంగారంలాంటి సత్యాన్ని పూర్తిగా పాడు చేసేరు. వ్యభిచారానికి సైతం అలవాటు పడ్డాడు. లంజల విషయంలో తగాదా పడ్డాడు. అదే వాడి ప్రాణం తీసింది. గిట్టని వాళ్ళెవరో ఆకేసు నామీద బనాయింపారు. ఛీ....ఛీ....(కంఠం రుద్ధమయింది) వాడు పోయినందుకే కృంగిపోయి ఏడుస్తున్నాను. పైగా ఈ అపవాదొకటి!

ప్లీడ: (సీరియస్‌గా అన్నాడు) నేను మామూలుగా ఏ కేసునూ టేకప్ చేయను. నా దగ్గరకొచ్చిన క్లెయింట్ దోషో నిర్దోషో కనిపెట్టేనేర్పు నాకు భగవంతుడిచ్చేడు. క్లయింట్ కళ్ళలోకి గుచ్చి గుచ్చి చూస్తాను. అతను నిర్దోషి అని నా అంతరాత్మ చెబితే ఆ కేసుని తప్పకుండా తీసుకుంటాను. హరిహరాదులు అడ్డుపడినా న్యాయాన్ని గెలిపించి నా విధిని నిలబెట్టుకుంటాను. (లేచి నించున్నాడు) ఆనాడు మీరు నా దగ్గరకి వచ్చినపుడు మీ కళ్ళలోకూడా నిర్దోషినే చూశాను. అందుకే మీ తరఫున వాదించేందుకు అంగీకరించాను.

ధన: రేపే కోర్టు. ఉదయమే కారు పంపుతాను. మీరింక రెష్టుతీసుకోండి. సెలవు.

ప్లీడ: సెలవు. ఇక వుంటాను.

[ధనకోటికి నమస్కరించి మేడెక్కివెళ్ళిపోయేడు ప్లీడరు. ధనకోటి బయటకు వెళ్ళబోతుండగా దీనబంధు ఎదురయ్యాడు. చేతులు జోడించాడు ధనకోటి. దీనబంధు అట్టహాసం ప్రారంభమైంది.]

దీన: నమస్కారం. నమస్కారం. నేను మీ కోసం మీ యింటికి వెడితే మీరు నా కోసం ఇక్కడికొచ్చేరన్న మాట. రాండి, రాండి. కూర్చోండి.

ధన: ఫర్లేదు. మీరు కూచోండి ముందు.

దీన: అమ్మమ్మ. మీరే ముందు.

[సత్యపీఠంలో పేపరుతీసి, కూచోమని సైగచేసేడు.]

ధన: నామాట వినాలి. ముందుమీరే కూచోండి.

దీన: అయ్యా! ప్రజాసేవకులం. నిలబడటమంటేనే యిష్టం. మీరు కూచుంటే నేనూ కూచుంటాను.

ధన: ఏమిటో....మరీ మొహమాట పెట్టేస్తున్నారు.

[ధనకోటి సత్యపీఠంలో కూచున్నాడు. మూడ్ మారుతోంది. అది గమనించలేదు దీనబంధు. తానుకూడా వేరే కుర్చీలో కూర్చున్నాడు. సానుభూతి వచనాలు ప్రారంభించేడు]

దీన: ఇంత మంచివారు. చీమకి సైతం కీడు తలపెట్టని వారు. ధర్మాత్ములు.అల్లాంటి మీమీద మర్డర్ కేసు బనాయించేరంటే నాకెంతో దిగులుగా వుంది. కష్టాలనేవి చెప్పిరావంటారు. ఇందుకే కాబోలు. చెప్పండి.నావల్ల మీకెటువంటి సాయం కావల్సివచ్చినా సిద్ధంగా వున్నాను.

ధన: నాకెవరి సహాయంగానీ సత్రకాయలు గానీ అక్కర్లేదు. అనుకున్నదేదో అనుకున్నట్టు సాధించేను. సత్యంగాడి పీడ విరగడయ్యింది. పెట్టిన చెయ్యినే నరకాలనుకున్నాడు భ్రష్టుడు. పూడ్చిపెట్టేసేను. నన్ను ఎదిరించి బతగ్గల మొనగాడా వాడు? హు .... అయిపోయేడు. అంతే!

దీన: (ఖంగారు పడ్డాడు) మీరేదో వేళాకోళం చేస్తున్నారు. మీరేమిటి? సత్యాన్ని చంపడమేమిటి? అతన్ని కన్నబిడ్డలా పెంచుకుని——

ధన: గాడిద గుడ్డు. ఎవడండీ బిడ్డ? నాకు పుట్టినబిడ్డలే నా బిడ్డలు. దారినపోయే ప్రతి ముష్టి వెధవనీ కన్నబిడ్డగాభావిస్తే నేనూ ముష్టివెధవనవుతానే తప్ప లక్షలు సంపాయించలేను. ఫేక్టరీలు నడపలేను. కూలిచేస్తున్నారు వాళ్లు. అందుకు డబ్బులిస్తున్నాన్నేను. అంతవరకే మా సంబంధం.

దీన: ఏమిటో....ఇవాళెందుకో మీరు అదోలా మాట్లాడుతున్నారు. ప్లీడరుగార్ని కలిసేరా?

ధన: ఎవడండీ ప్లీడరు? వాడొక భ్రష్టుడు. దొంగ ముండాకొడుకు. నేను ఖూనీ కోరునని వాడికి బాగా తెలుసు.అయినా సరె నన్ను ఇంద్రుడనీ చంద్రుడనీ పొగిడి నాటకమాడుతున్నాడు.నా దగ్గిర డబ్బుంది. వాడిదగ్గిర వాదించే విద్య వుంది? ఫీజిస్తాను. చచ్చినట్టు వాదిస్తాడు. బి.పి. పేషెంటుని. అనవసరంగా కోపం తెప్పించకండి. అర్జంటు పనులున్నాయి. వెళ్ళొస్తాను.

[ధనకోటి లేచేడు. తల విదిలించేడు. దీనబంధు కూడా అయోమయంగా లేచి నిలబడ్డాడు. చేతులు జోడించి ధనకోటి అన్నాడు]

ధన: వీలున్నప్పుడు తమరు మాఇంటికి రావాలి. నా ఆతిథ్యం స్వీకరించాలి. ఎప్పుడో ఎందుకు? రేపు కోర్టు అయిపోగానే ప్లీడరుగారు మా యింటికి యెల్లాగో వస్తారు. తమరుకూడా అదే కార్లో దయచేయండి.

దీన: ప్లీడరుగారికి ప్రోగ్రాం చెప్పేరా మరి?

ధన: వేరే చెప్పడమెందుకండి. నా తరఫున యిక్కడకొచ్చేరు. కనక ఆయన నా మనిషే! పైగా ఆయనకిల్లాంటి ఫార్మాలిటీస్ గిట్టవు. ప్లీడరంటే అందర్లాటి ప్లీడరా ఏవన్నానా? మూర్తీభవించిన న్యాయం. కనుక....అల్లాంటివేమీ ఆలోచించవద్దు. వార్తోపాటు వచ్చేయండి.

దీన: (చేతులు జోడింపు తీయలేదు. అయోమయం చూపు మార్చలేదు. నావ్వుతూ అన్నాడు) అల్లాగే....అల్లాగే....

ధన: (ఆశ్చర్యంగా) అదేమిటండీ? ఎందుకల్లా నీళ్ళు నములుతారు?

దీన: అబ్బే....మరేం లేదండి....వంట్లో ఏదోగా వుంటేను. సరే! తప్పకుండా రేపు సాయంత్రమే తమ దర్శనం చేసుకుంటాను.

ధన: సెలవు మరి.

[ధనకోటి వెళ్ళిపోతున్నాడు. దీనబంధు విచిత్రంగా చూస్తున్నాడు. బోయ్ విస్కీ ఫ్లాస్కుతో ప్లీడరు గదివేపు వెళుతూ, ఆగి వెనక్కి వచ్చి దీనబంధు పరిస్థితికి ఆశ్చర్య పోతూ పలుకరించేడు]

బోయ్: సార్!

దీన: ఊఁ!

బోయ్: ఏమిటి సార్....అట్లా వున్నారే?

దీన: మరేం లేదోయ్....రాజకీయవేత్తలకంటే ప్రజలే గొప్ప చమత్కారులని జలాలుద్దీన్ జైల్లో చెప్పేరు.

బోయ్: జలాలుద్దీనా? ఆయనెవరు సార్?

దీన: లక్నోలో వుండేవాడు. ఇప్పుడెక్కడున్నాడో తెలీదు. ప్రైమినిస్టరు కాతగినవాడు. ఆ లెవల్లో చేసేడు దేశ్సేవ. వ ది లె మ్. జలాలుద్దీన్ చెప్పింది అక్షరాలా నిజమని ధనకోటి గార్ని చూస్తే తెలిసింది. క్షణం క్రితం మాటాడింది క్షణం తర్వాత కాదు పొమ్మన్నాడు. ఎప్పుడో ఒకప్పుడు మినిష్టరై పోతాడు. ఆ లక్షణం నాకు తెలుసు.

[అని మేడెక్కి వెళ్ళిపోయేడు. బోయ్ ప్లీడరున్న వేపు మెట్లెక్కుతూ వెళ్ళిపోయాడు. నూటఒకటినుంచి రాంబాబు వచ్చి లాంజ్‌లో కూర్చున్నాడు. పేపరు తిరగేస్తున్నాడు. అతని చేతుల్లో సిగరెట్టుంది. అతను కూర్చున్న క్షణం తర్వాత 102 నుంచి శంకరం వచ్చేడు. శంకరాన్ని చూడగానే రాంబాబు లేచి నిలబడ్డాడు. షేక్‌హేండ్‌కోసం చెయ్యి జాపుతూ పరిచయం చేసుకున్నాడు.]

రాం: నా పేరు రాంబాబు!

శంక: (కరచాలనం చేస్తూ) శంకరం. భవానీ శంకరం!

రాం: లవ్‌లీ నేమ్! మీ పేరుతోనే నాకో క్లాసు మేటుండేవాడు. క మా న్....హేవె స్మోక్?

[సిగరెట్ పెట్టి ముందు పెట్టేడు]

శంక: సారీ! నేను కాల్చను!

రాం: ఈజిట్? అకేషనల్‌గా కూడా కాల్చరా?

శంక: అకేషనా?

రాం: ఎగ్జాక్టీ! మనిద్దరం కలుసుకోవటమే అకేషను అనుకుందాం. అందుకైనా కాల్చవచ్చుకదా!

శంక: ఆ మాటకొస్తే నేను ఛెయిన్‌స్మోకర్ని ఒకప్పుడు! పెళ్ళయిం తర్వాత చాలా అలవాట్లను మానుకున్నాను.

రాం: Why?

శంక: మీకు పెళ్ళయిందా?

రాం: అఫ్‌కోర్స్. కాలేదు.

శంక: అయితే మీకు చెప్పినా అర్థంకాదు.

రాం: పర్లేదు చెప్పండి. అయ్ విల్ ట్రై టు అండర్‌స్టాండ్ ది పాయింట్!

శంక: మనిషి జీవితంలో పెళ్ళి ఒక గొప్ప మలుపు. సరిగ్గా అక్కడ్నించే అతని జీవిత విధానం మారుతుంది. అలవాట్లు మారుతాయి. అయ్ లవ్ మై వైఫ్ సోమచ్!

రాం: ఆ సంగతి నాకు తెలుసు!


శంక: (ఆశ్చర్యంగా) తెలుసా? ఎల్లా తెలుసు?

రాం: ఇందాక మీరు మాటాడుకున్న కొన్ని వి ష యా లు విని ఆ నిర్ణయానికి వచ్చేను.

శంక: మేము మా టా డు కు న్న వి మీరు విన్నారా?

రాం: వినాలని కుతూహలం లేకపోయినా మీ మాటలు నా చెవిని సోకేయి. అయ్ కాంట్ హెల్పిట్!

శంక: (సీరియస్‌గా అన్నాడు) నిజం చెబుతున్నాను రాంబాబుగారూ! నా భా ర్య అమాయకురాలు. నాకోసం తన ప్రాణమయినా త్యా గ ం చే సే దేవత! నా అదృష్టంకొద్దీ ఆమె నాకు భార్యగా నా జీవితంలో అడుగుపెట్టింది. నన్నే నమ్ముకుంది. ఆమెను ఆనందపర్చడం నా కర్తవ్యం. సిగరెట్లన్నా, ఆ పొగ అన్నా నా వైఫ్‌కి రోత. వెగటు. ఆమె కోసం నా అలవాటుని మానుకోవాలి



ఎ కైండ్ ఆఫ్ శాక్రిఫైస్! పెళ్ళయిన కొత్త రోజుల్లోనే సిగరెట్లకి స్వస్తి చెప్పేను.

రాం: సిగరెట్లకి సేక్రిఫైస్ అని పేరుపెట్టేరా?

శంక: ఎ కైండ్ ఆఫ్ సేక్రిఫైసని అందుకే అన్నాను.

రాం: భార్యా భర్తలమధ్య ఇలాంటి త్యాగాలు అవసరమా?

శంక: అని వాదించలేను. భార్యకోసం భర్తా, భర్తకోసం భార్యా ఇలా సర్దుబాట్లు చేసుకోడంలో పెద్ద రిలీఫుంటుంది. పెద్ద థ్రిల్లింగ్‌గానూ వుంటుంది. నా అనుభవాన్ని పురస్కరించుకొని యీ స్టేట్‌మెంటిస్తున్నాను.

రాం: ఫెంటాస్టిక్! మీ అభిప్రాయాలు నన్ను బాగా మువ్ చేసేయి. ఇంతక్రితంవరకూ పెళ్ళే వద్దనుకున్న నా సొంత అభిప్రాయాన్ని మీ దంపతులిద్దరూ మార్చి పారేసేరు. నవ్, అయ్ వాంట్ టు మేరీ! (ఆగి అన్నాడు) మీరు ఏమీ అనుకోకపోతే....

శంక: (ఆనందంగా) నాపెటాల్! ఏమీ అనుకోను. ఒ. కె?

రాం: థేంక్యూ! ఒక్క అయిదు నిమిషాలు. జస్టు ఫైవ్ మినిట్స్. నాకు స్పేర్ చేయాల్సి వుంటుంది. అఫ్‌కోర్స్ మీకది కష్టంగానే వుండొచ్చు. ఈ కొత్త ఫ్రెండుకోసం—

శంక: ఒ. కె! ఒ. కె!

[రాంబాబు సత్యపీఠం చూపించేడు]

రాం: ప్లీజ్. హేవ్ ది సీట్!

[శంకరం సత్యపీఠమ్మీద కూర్చున్నాడు. సంచలనం ప్రారంభమయ్యింది]

రాం: ఇప్పుడు నేను మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడగదలచుకున్నాను.

శంక: ప్రొసీడ్!

రాం: మీరు, మీ భార్యని అమితంగా అపారంగా ప్రేమిస్తున్నారు.

శంక: స్టాప్‌దట్ నాన్‌సెన్స్! నేనెప్పుడూ నా భార్యను ప్రేమించలేదు. ఇకముందు ప్రేమించలేను.

రాం: (ఆందోళన నటించి) శంకరంగారూ!

శంక: దాని తండ్రి పెద్ద కంట్రాక్టరు. లక్షలున్నాయి. ఒక్కగానొక్క కూతురు. వాళ్ళకి డబ్బు మదమెక్కువ. నాకు డబ్బు మీద వ్యామోహమెక్కువ. అందుకే మా ఇద్దరికీ పెళ్ళయింది. లెట్ మి హేవ్ యువర్ సిగరెట్—

రాం: (చిరునవ్వుతో) విత్ ప్లెజర్! (సిగరెట్టిచ్చేడు)

శంక: (సిగరెట్ ముట్టించుకుని అన్నాడు) ఏభై వేల కట్నం. పెద్ద మొత్తం. విత్ ఫిఫ్టీ థౌజంట్ బక్స్—దే హేవ్ కిల్డ్ మై లవ్ ఎండ్ లైఫ్! యాభై వేలరూపాయలతో నా ప్రేమనీ నా జీవితాన్నీ చంపేసేరు. ఇదే హోటల్లో రూం నెంబర్ సెవెంటీటూలో నా లవ్ వుంది. పేరు రీటా. నాకోసం ఈ హోటల్లోనే దిగింది. క్షణమో యుగంగా గడుపుతోంది—సింగిల్‌గా. నేను రీటాని కలుసుకోవాలి. నాకూ నా రీటాకూ ఈ బ్లడీ సుగుణ ప్రతిబంధకంగా వుంది. యాభై వేలు పోసి కొనుక్కున్నాననే ధీమా నా పెళ్ళానికి. దాని తండ్రి ఛస్తే లక్షాధికారి నవుతాననే ఆశ నాకు. ఇటీజ గేమ్ గోయింగాన్ సిన్స్ మై మేరేజ్. డబ్బింటి పిల్లగదా—అది చెప్పింది వేదం. అది ఏడిస్తే ఏడవాలి. నవ్వితే నవ్వాలి. అంతేగాని నా సొంత ఏడుపుకీ నవ్వుకీ విలువే లేదు. (ఆగి అన్నాడు) మిస్టర్, పెళ్ళిలో సుఖం లేదు. ప్రేమించు. ఎవర్నో ఒకర్ని ప్రేమించు. పెళ్ళొద్దు. ప్రేమిస్తునే జీవితాన్ని లాగించెయ్. ఇది నా ఫిలాసఫీ!

[లోపల్నుంచి సుగుణ ఏవండీ అని పిలిచింది]

రాం: మీ వైఫ్ పిలుస్తున్నారు!

శంక: వైఫ్ కాదు. డబ్బు. డబ్బు పిలుస్తోంది. లక్షలు. లక్షలు పిలుస్తున్నాయి. అయ్ మస్టు ఒబే! రీటాని చూళ్ళేదు మీరు. పూర్ రీటా! రీటా పిలుస్తే ఆ పిలుపులో ప్రేమ వినిపిస్తుంది. మ్యూజికాఫ్ లవ్—అదే వినిపిస్తుంది. ఇవాళ నా వైఫ్‌కి స్లీపింగు టాబ్లెట్సిచ్చి నేను రీటా గదిలోకి వెళ్ళిపోతాను. అలనాటి స్వర్గం మళ్ళా కావాలి నాకు.

[ఏవండీ-అనే పిలుపు మళ్ళీ వినిపించింది. శంకరం లేచి నుంచున్నాడు. తల విదిలించేడు. ఖంగారుగా అన్నాడు]

శంక: వస్తున్నా సుగుణా! వచ్చేస్తున్నా! (చేతిలో సిగరెట్ కనిపించింది. రాంబాబు నుద్దేశించి అన్నాడు) మీరేనా ఇచ్చింది?

రాం: అవును.

శంక: (సిగరెట్‌ని కాల్తో నలుపుతూ అన్నాడు) మీకో నమస్కారం. దయచేసి నన్ను పాడుచేయకండి!

[వేగంగా తన గదిలోకి వెళ్ళిపోయేడు. రాంబాబు హాయిగా నవ్వుకుంటున్నాడు. అంతలో 'పాలీష్' అని బిగ్గరగా కేక వినపడింది. రాంబాబు ఉలిక్కిపడ్డాడు. అటువేపు చూసేడు. మాలీషువాడు వెలిసేడు]

మాలీ: మీరేనా బాబూ....పిలిచేరట. పని మొదలుపెట్టమంటారా?

రాం: నేను పిలవలేదు. నీ పనేమిటో నాకు తెలీదు!

[అని తాను తన గదిలోకి వెళ్ళిపోయేడు. మాలీషువాడు భుజాలెగరేసేడు. మళ్ళా బిగ్గరగా 'మాలీష్' అని కేక పెట్టేడు. ప్లీడరు గారు బనీనుతో వున్నాడు. మేడ దిగుతూ అన్నాడు]

ప్లీడి: ఏరా? ఎప్పుడో కబురంపితే ఇప్పుడా రావడం?

మాలీ: (సంతోషంగా) మీరా బాబూ పిలిచింది? ఆ సంగతి బెదరు చెప్పేడుగాదండి. ఎవరో పాసింజేరనుకున్నానే గానీ దేవుడు ప్లీడరుగారని తెలుస్తే క్షణాల్లో వచ్చేదునండి!

ప్లీడ: (తనకిచ్చిన బిరుదుకి ఆనందించేడు) దేవుడు ప్లీడరా? వాడెవడ్రా? (ఒక కుర్చీమీద కూర్చున్నాడు.)

మాలీ: ఇంకెవరో యేంటి బాబూ? తమరే? తమరు మాకు దేవుడు ప్లీడరే మరి! న్యాయం యెటుంటే తమరంటుంటారు. ఇది నాఒక్క మాటాకాదు బాబూ! కోర్టు కెళ్ళి కనుక్కోండి. బంట్రోతు దగ్గిర్నుంచి జడ్జీ వారకూ అంతా యిదే మాటంటారు.

ప్లీడ: (మరింత మురిసిపోయేడు) సర్లే వోయ్! వన్నోనే కాదు మాటల్లో కూడా వుంది మాలీషు. పోచికోలు ఖబుర్లాపి పని మొదలెట్టు.

మాలీ: తలొంచేసి కాళ్ళు చాపుకోండి బాబూ! దెబ్బమీద దెబ్బ నాలుగైదు దెబ్బ లిచ్చేస్తాను.

[ప్లీడరు తన కాళ్ళని సత్యపీఠమ్మీద పెట్టేడు. కదలిక ప్రారంభమయ్యింది. గంభీరంగా అడిగేడు.]

ప్లీడ: రోజుకెంత సంపాయిస్తావురా నువ్వు?

మాలీ: (వళ్ళు పడుతూ అన్నాడు) అంతా గాలి వాటం బాబూ! లేచినేళ మంచిదైతే దిగుల్లేదండి. పొద్దున్నే యెదవ బేరం తగిలిందనుకోండి—ఇంకా రోజు పస్తే బాబూ!

ప్లీడ: పస్తులుండొచ్చు. ఆకలితో చావచ్చు. కానీ నీ వృత్తిలో నిజాయితీ వుందిరా మాలీషు. నీ రెక్కల కష్టమే నీకు రక్ష. నేనూ వున్నాను ఎందుకు? భూమికి బరువు.

మాలీ: (తనని పొగిడినందుకు మెలికలు తిరిగినా—ప్లీడరు తనని తాను తిట్టుకున్నందుకు బాధపడ్డాడు) తమరట్లా నన్ను మెచ్చుకుంటే సిగ్గేస్తది బాబూ! తమ రెక్కడ, నేనెక్కడ? తమది బుద్ధి బలం. నాది జబ్బబలం. కూలికి వళ్ళు పట్టి కడుపు నింపుకునే బతుకు బాబూ నాది! తమ రట్టా కాదే? దేవుడు ప్లీడరు. న్నాయంకోసం బతికే దేవుళ్ళు.

ప్లీడ: కాదురా! ఆ ముసుగులో బతుకుతున్న లోఫర్ని!

మాలీ: (బాధగా + ఆశ్చర్యంగా) బాబూ!

ప్లీడ: అబద్దం పెట్టుబడి నాకు. లౌక్యం నా ఊపిరి! నెత్తురు తాగే పులిని బోనులో నుంచోబెట్టి 'యువరానర్ ఇది గంగిగోవ'ని వాదించి నమ్మిస్తాను. వేలకు వేలు సంపాయిస్తాను. మోసం దగా కుట్రలకు ప్రాణం పోస్తాను. అవినీతికి పట్టాభిషేకం చేస్తాను. నేను తొడుక్కున్న కోటు నలుపు. నా బుద్ధి నలుపు. నా వంట్లో ప్రవహించే నెత్తురు నలుపు.

మాలీ: (బెదిరిపోయేడు) బాబూ!

ప్లీడ: ధనకోటి—ఫేక్టరీ ఓనరు—తెలుసు గదా!

మాలీ: (బెంగగా అన్నాడు) తెలుసు బాబూ!

ప్లీడ: వాడు సత్యాన్ని చంపేడు!

మాలీ: (భయపడ్డాడు) బాబూ!

ప్లీడ: ఒక్క సత్యాన్నే కాదు. వాడు ఎందర్నో పొట్టన పెట్టుకున్నాడు. అల్లాంటి స్కౌండ్రల్ని ఉరిశిక్ష నుంచి తప్పించాలి. వాడిదే ధర్మం న్యాయమని వాదించాలి. అల్లాంటివారికోసమే నేనీ వృత్తి చేపట్టేను. ఒరే మాలీషూ—

మాలీ: (కలతపడిపోయేడు) బాబూ!

ప్లీడ: నీ జబ్బ బలంతో ఒక మంచి పని చేయరా? నా పీకను కసితీరా నలుపు. నిలువు గుడ్లతో చావాలి నేను.

మాలీ: (ఆందోళనగా) బాబూ!

ప్లీడ: నా పీడ విరగడవ్వాలి! చంపరా! చంపు!

మాలీ: (పని ఆపేసి దూరంగా జరిగి భయం భయంగా అన్నాడు) నేను కూనీకోర్ని కాదు బాబూ! నన్ను విడిచి పెట్టేయండి.

[లాయరు సత్యపీఠమ్మీంచి కాళ్లు తీసేడు. తల విదిలించేడు.]

ప్లీడ: అబ్బ! ఇప్పుడెంతో హాయిగా వుందిరా మాలీషు! నీ చేతుల్లో ఏముందోగాని వళ్ళు ఉలిపిరి కాగితమయిందనుకో!

మాలీ: (సూటిగా చెప్పేడు) వళ్ళు సంగతేమోగాని బాబూ—నా చేయి పడితే మాటకూడా మారిపోద్దని తెలిసిందండి!

ప్లీడ: (ఆశ్చర్యంగా) ఏమిట్రా? మాట మారుతుందా?

మాలీ: అవును బాబూ! తమరేం మాటాడేరో—

ప్లీడ: ఏం మాటాడేనురా?

మాలీ: ధనకోటి బాబుగార్ని నోటికొచ్చినట్టు తిట్టిపోసేరండి. తమకు తిక్తవుంటే

ఆరు లేరుగానీ బాబూ—వుంటే మాత్రం....

ప్లీడ: (అకస్మాత్తుగా లేచి నించున్నాడు) నోరు కుట్టేస్తాను రాస్కెల్! వళ్ళు తిమ్మిరిగా వుందా యేమిట్రా? నేను—నేను శ్రీ ధనకోటిగార్ని నోటికొచ్చినట్టు తిట్టేనా? ఆయన్ని కలలోకూడా తిట్టలేన్రా నేను! వళ్ళు పట్టే వెధవ్వి,వళ్ళు కొవ్వెక్కి దేవుడు ప్లీడరు ముందే అబద్ధాలాడుతావ్రా?

మాలీ: (దీనంగా అన్నాడు) తల్లితోడు బాబూ! తమరు తిట్టేరు!

ప్లీడ: ఛీ....మీ జాతి నీచమే అదిరా! సాక్ష్యం లేకుండా చూస్తారు. మీ నోటికొచ్చినట్టు కూస్తారు. ఆ మాటలన్నీ మేమే అన్నట్టు అక్కడికి మోస్తారు.

దీన: (వస్తూ అన్నాడు) ఏమిటండీ? యేం జరిగింది? ఎందుకట్లా పేదముండావాడి మీద విరుచుకుపడతారు?

ప్లీడ: (కోపంగా) పేదముండావాడేనండీ నెత్తి మీదకు తెచ్చేది. అప్టరాల్ ఈ వెధవ యేం కూసేడో వింటే....

మాలీ: (వణికిపోతూ అన్నాడు) నేనేం కూయ లేదండి బాబూ! నా మాట నమ్మండి. ఆరికంటే నేనే మెరుగని ముందర నా బతుకుని మెచ్చుకున్నారండి.

ప్లీడ: (అక్కసుగా) విన్నారా? విన్నారా? నేనెక్కడ—వీడెక్కడ? వీడు నా కంటే ఘనుడని మెచ్చుకుంటానా?

దీన: దాంటో తప్పేముందండి? దేశానికి పేదలే ప్రాణమని తిరుక్కుచ్చి నంబియార్ ఎప్పుడో అన్నాడు.

ప్లీడ: (కోపంగా) ఎవడండీ తిరుక్కుచ్చి నంబియార్? రమ్మనండిలా నేను చెబుతాను వాడికి!

దీన: తిరుక్కుచ్చి నంబియార్ని తీసేయకండి. మళయాళ దేశమ్మొత్తమ్మీద గొప్ప ప్రజాసేవకుడు. నాగపూర్ జైల్లో మేమిద్దరం రెండేళ్ళున్నాం. 'ప్రాణం వుంటే దేహం బాగు—పేదల్తోనే దేశం సాగు' అని తిరుక్కుచ్చి మళయాళంలో అంటే నేను దాన్ని తెలుగు చేసేను. (ఉపన్యాస ధోరణిలో) పేదలంటే 'ఎవరనుకుంటున్నారు? ఎవరని మీ ఉద్దేశమని అడుగుతున్నాను. పేదల్లోనే రాముడున్నాడు. వాళ్ళల్లోనే క్రీస్తు ప్రభువున్నాడు. అల్లా దేవుడున్నాడు. అసలు వాళ్ళతోనే దేశం వుంది.

మాలీ: ఇప్పుడెందుకో మాట మారుస్తున్నారు గాని బాబూ—ఇంతకు ముందు మీకు మల్లె పేదోళ్ళని దేవుడు ప్లీడరుగారు మెచ్చుకున్నారండి. శానా మెచ్చుకున్నారు.

ప్లీడ: అదుగో మళ్ళీ! ఆ మాటే వద్దన్నాను. నోటికొచ్చినట్టు మిమ్మల్ని పొగిడేందుకు నేను రాజకీయాల్లో లేనురా! ప్లీడర్ని. గుర్తుంచుకో!

దీన: (దెబ్బ తగిలింది) అంటే మీ దృష్టిలో మేము—మా రాజకీయవేత్తలం అష్టారాలనే కదా అర్థం?

ప్లీడ: అట్లా మీకెందుకర్థమైంది?

దీన: ఇంకా యేమని అర్థం చేసుకోమంటారు?

[వాళ్ళిద్దరూ పోట్లాడుకోడం మాలీకు కిష్టం లేదు. అంచేత కలుగజేసుకున్నాడు]

మాలీ: బాబూ మీకు దణ్ణాలెడతాను. మీరు తగూలాడుకోవద్దండి! యెదవని—ఈ గోలంతా నా మూలనే వచ్చింది.

ప్లీడ: ఒరే! వినయం నటించకు. వళ్ళు మంట నాకు. వినయం నటించే ప్రతి మనిషినీ (దీనబంధుని సూటిగా చూస్తూ) అయ్ హేట్ హిం!

[అని మేడెక్కి తన గదిలోకివెళ్ళిపోయేడు]

మాలీ: అర్థంగాక అమాయకంగా అడిగేడు. యేంటిబాబూ అంటారాయన!

దీన: (శాంతంగా అన్నాడు) మనమంటే రోత్రా! వదిలెయ్.

మాలీ: మనమంటారేంటి బాబూ! ఇంత

పెద్దోరు. తమరన్నా కూడా—

దీన: రోతేరా! ఆ మనిషికి అసలు కోపమంతా నామీదేరా! ఈ ఆసామికి నేనెంత దగ్గరవుతుంటే అతనంత దూరమవుతున్నాడు. ఇతని తోడల్లుడుకూడా నాలాగే ప్రజా సేవకుడు. కాకపోతే అతన్దో గ్రూపు!

మాలీ: సేవకి గ్రూపులేంటి బాబూ, మద్దెన?

దీన: ఉంటాయి నాయనా! అవి వున్నాయి గనుకనే ఈ ప్లీడరుకు నేనన్నా నా గ్రూపన్నా వళ్ళు మంట.కాని మాలీషూ- ఈ కోపతాపాలు నాలాటి ప్రజాసేవకుడు అసలు పట్టించుకోడు. మెచ్చుకున్నా- మెడమీద చేయివేసి డొక్కలో పొడిచినా ఒక్క చిరునవ్వుతో సరిపెట్టుకుంటాం. మా నిస్వార్ధ సేవా నిరతిలో తేడాలు రావు. (ఆగి అన్నాడు) ఆ కుర్చీ యిట్లా లాగు!

[మాలీషు సత్యపీఠాన్ని తీసుకొచ్చేడు]

దీన: పేదలకు చేసిన సేవే సేవ అన్నాడు మాధవరావు బాజీ!

మాలీ: (కుర్చీ తుడుస్తున్నాడు) ఆయనెవరు బాబూ?

దీన: మహారాష్ట్రి మనిషి. నెహ్రూగారికి కుడి భుజం. నేనంటే వల్లమాలిన ప్రేమ. గుల్బర్గా జైల్లో మేమిద్దరం ఏడాది పాటున్నాం. తెలుగుదేశంలో ఒక్క దీనబంధే పేదలకు బంధువని మరాఠీ పేపర్లో రాసేడు. ఆ భాష మనవాళ్ళకి రాదుగనక నన్ను గుర్తించవలసినంతగా గుర్తించడంలేదు. కొంచెం భుజాలు పట్టు.

[సత్యపీఠమ్మీద కూచున్నాడు. మార్పు ప్రారంభమయ్యింది. మాలీషువాడు పనితోపాటు మాటలు మొదలుపెట్టేడు]

మాలీ: తమరొద్దన్నా సరే! తమకో నిజం చెప్పెయ్యాలి!

దీన: ఊ....చెప్పు!

మాలీ: మా పేదోళ్ళందరికీ తమరంటే భక్తి బాబూ! ఎదవని తమగురించి ఇన్నాళ్ళా ఏంటో అనుకున్నానేగాని, తమరిందాక ప్లీడరు బాబుగార్ని దులిపేసేతలికి నాకెంతో ఆనందమేసిందండి.

దీన: ఊ....వేస్తుందిరా! ఆనందమే వేస్తుంది! దేశంలో మీకు మెజారిటీ యెక్కువ. ఎంత అధికారంలో వున్నా మాకు మీరే పెట్టుబడి. మేము మీ కాళ్ళు పట్టుకోక తప్పదు. మీరే మా పాలిట కామ ధేనువులు. కల్పతరువులు. మీరు తిరగబడితే మాకు పుట్టగతులుండవు.అందుకే మీరు తిరగబడకుండా మేము జోకొడుతుంటాం. ఓట్లేయించుకుంటాం. గద్దెనెక్కుతాం. సమయానుకూలంగా దెబ్బ తీస్తుంటాం.

మాలీ: (అర్ధంకాలేదు. అందుకే ఆనందించి అన్నాడు) బాగా చెప్పేరు బాబూ! దేశంలో మీలాటోళ్ళు ఒకరిద్దరున్నారు గనుకనే మేమింకా ఇట్లాగైనా బతుకుతున్నాం.

దీన: ఆ ఒకరిద్దర్లో నేను ఛస్తేవుండను. తీసేయ్ నన్ను!

మాలీ: (షాకు తిన్నాడు) బాబూ!

దీన: మీలాంటివాళ్ళను నెత్తి నెక్కించుకుని తిరిగేందుకు నేను గాంధినీ కాను.పండిత నెహ్రూనీ కాను. నేను నేనే. దీన బంధుని. పేరులోవున్న కీర్తి గుణంలో లేదు.

మాలీ: (కలవరపడ్డాడు) బాబూ!

దీన: మీవల్ల మా కేమిట్రా లాభం? ఓట్లు వేసేంతవరకే మీరు. ఆ తర్వాత మా ప్రజలు మాకున్నారు. మా ప్రజాసేవ మాకుంది. అసలు ప్రజలంటే ఎవరనుకున్నావురా నువ్వు?

మాలీ: (బిక్కమొగంతో అన్నాడు) అదికూడా తమరే చెప్పేయండి బాబూ!

దీన: రిక్షా లాగేవాళ్ళూ, మాలీషుగాళ్ళూ, ఫేక్టరీ వర్కర్లూ, కూలీనాయాళ్ళూ వీళ్ళేనను కుంటున్నావా ప్రజలు?

మాలీ: (రోషంగా అన్నాడు) ఆళ్ళేనని ఎట్టా అనుకుంటాను బాబూ? ఆళ్ళు కూడా

పెజలే కదాని మనవి చేసుకొంటాను బాబు!

దీన: వీల్లేదు. కుదరదు. వాళ్ళని ప్రజలని పిలిచేం దుకు మా రూల్సు వప్పుకోవు. అలగా జనాన్ని ప్రజలని పిలవలేం. మమ్మల్ని అంటుకు తిరిగేవాళ్ళే మా ప్రజలు. ఎన్నికల్లో మా తరపున డబ్బు ఖర్చు పెట్టిన పెద్దలే—మా ప్రజలు. లాలూచీ కుస్తీల్లాగా మాకు దారిచ్చి తప్పుకున్న మాజీ నాయకులు, వాళ్ళ ముఠావాళ్ళు, మందీ మార్బలమంతా కూడా మా ప్రజలే. మాకు వాళ్ళు సహకరించేరు గనక మేము వాళ్ళకి సేవ చేయాలి. ఈ అయిదారేళ్ళలో అది నెరవేరితే చాలు ప్రజాసేవ అని బోర్డు కట్టుకుంటాం.

మాలీ: (కృంగిపోతూ అడిగేడు) అంతేనా బాబూ! అంతేనా? ప్రజలంటే ఆళ్లేనా? మరి, మేము ఎవరు బాబూ? మా పేరేంటి?

దీన: ఉత్తుత్తి ప్రజలు. చదరంగంలో పావులు. మీరంతా ప్రజల్లో చేరిపోతే లక్ష దాటు తుందిరా సంఖ్య! ఇంతమందినీ అయి దేళ్ళలో ఉద్ధరించాలంటే దేవుడితరం కూడా కాదు. వాళ్ళనట్లా వదిలెయ్. పెద్ద పెట్టుబడితో ఈ రంగంలో అడు గెట్టేం. మా బాగు మాటేమిటి? మా భవిష్యత్తేమిటని అడుగుతున్నా న్నిన్ను!

మాలీ: అర్థమైంది బాబూ! బాగా అర్థమైంది. ఏళాకోళమాడుతున్నారేమో అనుకు న్నాను. ఆ ప్లీడరెంతో తమరూ అంతే నని బాగా అర్థమైంది బాబూ!

దీన: వేళాకోళమా? నేను నీతో వేళాకోళ మాడతానుట్రా? నువ్వేమైనా గవ ర్నరువా? ఛీఫ్ మినిష్టరువా? ఒరే— వీధుల్లో మీకు చెయ్యెత్తి నమస్కరి స్తున్నానని మీరంతా నన్ను వెర్రి వెంగళప్పనుకుంటున్నార్రా! మీ బావ మరిదిగాడినని చొరవ తీసుకుంటు న్నారు. జాగ్రత్త. చీమని నలిపినట్టు నలిపేగలను.

మాలీ: నలిపేయండి బాబూ! మా జాతి మొత్తాన్ని నలిపేయండి. ఆ తర్వాత బాబూ.... మీ మాయ మాటలు నమ్మి, మోసపోయి, మీకు ఓట్లు వేసేందుకు మా జాతే వుండదు.

దీన: అందుకేరా.... ఆలోచిస్తున్నాను. ఆగి పోతున్నాను. మీరుండాలి నాయనా. మా మాటలు నిన్నా ఇవాళ రేపు మీరు నమ్ముతుండాలి. ప్రతి తడవా మమ్మల్ని గెలిపిస్తుండాలి. మేము బాగుపడు తుండగా మీరు రోజుకో చావు చావాలి. లంగరు బాతురా మీ జాతి. గుప్పెడు మెతుకులు చాలు పాపం. మాకు రోజుకో బంగారు గుడ్డిస్తారు. బాతుని చంపం. మీ మేతలో కోటా పెంచం. దినదిన గండం నూరేళ్ళాయుష్షు. మీ రట్లాగే బతకాలి. మీ హోదా పెంచితే తెలివితేటలొస్తాయి. తెలివి మీరితే మీరు నాయకులవుతారు. మేము ప్రజల మవుతాము. ఆగిపోయేవే—భుజాలు పట్టు!

మాలీ: పనైపోయింది బాబూ! సెలవిప్పిం చండి....

[మాలీషు వెళ్ళిపోతుండగా దీనబంధు లేచేడు. తల విదిలించేడు. మాలీషువాడ్ని యెంతో ప్రేమగా పిలిచేడు]

దీన: ఏవిట్రా అది? మాటా పలుకూ లేకుండా వెళ్ళిపోతావే? ఆగు నాయనా! ఆగు! (మాలీషు ఆగేడు) పిచ్చివాడా—డబ్బు లొద్దట్రా నీకు?

మాలీ: (నిష్ఠూరంగా అన్నాడు) ప్లీడరేమిచ్చే డని మిమ్మల్నడగను?

దీన: అమాయకుడా! అతన్నీ నన్నూ ఏకం చేస్తావా? అతని గ్రూపేమిటి? నా గ్రూపేమిటి? వాళ్ళ గ్రూపు దోపిడి గ్రూపు. నేను ఆ జాతివాడ్ని కాను నాయనా! మీలో ఒకడ్ని. మీ వాడ్ని.

మాలీ: (అయోమయంగా) బాబూ!

దీన: (పది నోటిస్తూ) అయినా సరే! ప్లీడర్ని

క్షమించు. అతని డబ్బులుకూడా నేనే యిస్తున్నాను. ఇదుంచు!

మాలీ: (తీసుకుంటూ అన్నాడు) బాబూ! ఈ మాయేంటో తెలవకుండా వుందండి!

దీన: పాపం! మీరంటే నా కందుకే జాలిరా! పది స్తే మాయంటున్నావు. అదే వంద కాగితమి స్తే నీ గుండె ఆగిపోతుంది. అందుకే పెద్దపెద్ద ఉపకారాలను మేము తలపెట్టం. మీ స్థితిగతుల్ని మెల్లి మెల్లిగా మెల్లిమెల్లిగా మెరుగుపరచా లని చల్లా వెంకటప్పయ్య నాతోపాటు నెల్లూరు జైల్లో వుండగా చెప్పేడు. ఒకటి గుర్తుంచుకో....మీ అందరి కోసం బతుకుతున్నాను. మీ బతుకు ల్లోనే నా బతుకు ముడిపడి వుంది. వుంటుంది!

[దీనబంధు మేడ ఎక్కేడు. మాలీషుకి పిచ్చెక్కినట్టయింది. చేతిలో పదిరూపాయల కాగితం చూస్తూ పిచ్చిగా అరిచేడు—మాలీష్ అని]

బోయ్: (వస్తూ అన్నాడు)ఏయ్....ఏమిటా కేక? హోటలనుకున్నావా? రోడ్డనుకున్నావా?

మాలీ: పిచ్చెక్కింది బెదరూ! ఈ హోటల్ కెవడో చేతబడి చేసేడు.

[మళ్ళా మాలీష్ అని గట్టిగా కేక పెట్ట బోయేడు. బోయ్ అతని నోరు మూసి అన్నాడు]

బోయ్: పాసెంజేర్లు వింటే నన్ను తిడతారు. ప్రొప్రయిటరు వింటే నా ఉద్యోగం ఊడపీకుతాడు. తొంభైతొమ్మిదికెళ్ళు. సినీమా డేన్సరు జయమ్మగారికి మాలీషు చేయాలంట.

[మాలీషువాడు మళ్ళా అరవబోయి నోరు మూసుకుని మేడమెట్లు ఎక్కి వెళ్ళిపోయేడు. బోయ్ సత్యపీఠాన్ని చూసేడు. అది విడిగా ఎక్కడో వుండటం అతని కిష్టంలేదు. దాన్ని తీసి మునుపటి స్థానంలో వుంచేడు. అలిసి పోయి వున్నాడేమో అటూ యిటూ చూసి సత్యపీఠమ్మీద కూచున్నాడు.మూడ్ మారింది]

మాలీ: (మేడ దిగి వచ్చి అన్నాడు) తలుపు కొడితే తర్వాత రమన్నారు బెదరూ!

బోయ్: ఎవరు బెదరూ?

మాలీ: సినీమా డేన్సరు జయమ్మగారు!

బోయ్: లేచిపోయేవు. ఎవడో బేరం తన్నుకు పోయుంటాడు. ఎవడోగాని ఆ గదిలో చేరిపోయి నీ పనీ వాడి పనీ వాడే చేస్తు న్నాడు. (ఆగి అన్నాడు)ఎవడై వుంటా డబ్బా? (గుర్తుకు వచ్చింది) ఆ....ఇంకె వడు? ఆ లైన్లో దేవుడు ప్లీడరే వున్నాడు. దొంగనాయాలు. ఆడవాసన తగుల్తే చాలు వాడికి నరాలు జివ్వు మంటాయి. సినీమా డేన్సరుకదా— ఇంక చెడుగుడే!

మాలీ: ఇదేంట్రా దేవుడా? బెదరుకూడా మొద లెట్టేడండీ!

బోయ్: ఏమిటి మొదలెట్టేను?

మాలీ: నిజాలు బాబూ! పచ్చి నిజాలు. ఒక పక్క దేవుడు ప్లీడరంటానే వున్నావ్. ఇంకో సైడునుంచి చెడుగుడం టన్నావ్!

బోయ్: అంటాను. ఇంకా అంటాను. నాకేం భయమా?

మాలీ: మీ ప్రొప్రయిటరుగారింటేనో?

బోయ్: హు....ప్రొప్రయిటరు, పదేళ్ళ క్రితం వాడి జాతకమేమిటో అడుగు చెబు తాను. అప్పట్లో వాడొక కోన్‌కిస్కా గొట్టాంగాడు. వంటలు చేసుకుని బతికే వాడు. గోప్పారింటో వంట మొదలెట్టి వాళ్ళ ఆడంగుల్ని సరిచేసేడు. డబ్బా దస్కంతో ఆమెగార్ని ఇల్లు దాటించి, బొంబాయిలో ముండల కంపెనీ నడిపి పెరిగిపోయేడు. ముండల కంపెనీ మేనేజ్ చేసినవాడికి హోటల్ నడపడం లెక్కా? జమా? ఇక్కడికొచ్చి ఈ హోటల్ పెట్టేడు. పేరుకి ఫేమిలీసే గాని యిన్ని గదుల్లో ఎన్ని ఫేమిలీ సున్నాయంటావ్? లైన్‌కో రూము. అంతె! (ఆగి అన్నాడు) అసలు హోటళ్ళకి డిమేండెందుకో తెలుసా?

మాలీ: (తెలీదన్నట్టు తలూపేడు)

బోయ్: ఇక్కడికొచ్చె పాసింజేర్లలో నూటికి దెబ్బైమందికి సొంతింటో సుఖముండదు. కేంపనీ మరోటనీ గేస్‌కొట్టి ఇక్కడ కొలువెట్టి, ఇంటో దొరకని సుఖాన్ని యిక్కడ కొనుక్కుంటారు. హోటలు గుమ్మం ఎక్కంగానే గాండ్రిస్తారు. పెద్దపులులై పోతారు. ఇంటి తలుపు కనిపిస్తే చాలు— పిల్లులు—బావురు పిల్లులై పోతారు. పెళ్ళాం కాల్తో తంతే పళ్ళూడగొట్టుకున్న హీరోలంతా యిక్కడికొచ్చి వీర మొనగాళ్ళమంటారు. తెల్ల వెంట్రుకలకు నల్లరంగు వేయించుకుంటారు. మాలీషులు చేయించుకుంటారు. తాగి తందనాలాడుతారు. లంజలు కావాలంటారు. ఎక్క డాలిస్యమైనా మామీద యింత యెత్తున్న గాండ్రుమంటూ లేస్తారు. మేమే వాళ్ళకి లోకువ. వాళ్ళ దృష్టిలో మేమంతా లోఫర్ల మి.బేవార్సుగాళ్ళమి. తాగేది తాగుతూనే వుంటారు. లెక్క తప్పు చెప్పేమని మామీద చెప్పు తీస్తారు. బతికేందుకి చాకిరీ చేస్తున్నామేగాని బ్రెదరూ—నీతి నిజాయితీల్లో పేసింజేర్ల కంటే, ప్రొప్రయిటరు నా కొడుక్కంటే మేమే బెటరు.

[బజర్ వినిపిస్తుంది. లేచి నించున్నాడు. తల విదిలించేడు. బోయ్‌వేపు మాలీషు మనిషి ఆశ్చర్యంగా చూసి—మాలీష్ అని గట్టిగా అరిచేడు. బోయ్ ఉలిక్కిపడ్డాడు]

బోయ్: ఏయ్....యేమిటా కేకలు? నీక్కాదూ చెప్తూంట. మనిషయ్యేక ఒకసారి చెప్తే వినాలి. అవసరమైతే ఖబురు చేస్తాను. ఇంక వెళ్ళు!

మాలీ: నువ్వుండమన్నా యిక్కడో క్షణం వుండలేను బెదరూ! మీ అందరికీ ఎట్టాగుందోగాని నా కిది పిచ్చాసుపత్రిగా వుంది. మిమ్మల్నందర్నీ (చేతులు పైకెత్తి-దేవుణ్ని ఉద్దేశించి) ఆదే ఆదుకోవాలి.

[మాలీష్ అని మెల్లిగా అంటూ వెళ్ళిపోయేడు. మళ్ళా బజర్ వినిపించింది?]

బోయ్: కమింగ్‌సార్! (అంటూ మేడమెట్ల వేపు వెళ్ళిపోయేడు]

[సుగుణ బయటకు వచ్చింది. ఎవ్వరూ లేరని చూసి బయటనుంచే భర్తను పిలిచింది]

సుగు: ఏవండీ!....మిమ్మల్నే—

శంకరం: (వస్తూ అన్నాడు) పిలిచేవా సుగుణా!

సుగు: (వాచీ చూసుకుంది) మేట్నీకి టైమవుతోందండీ!

శంక: ప్రతి చిన్న విషయానికీ ఆందోళనపడకు సుగుణా! వెళ్ళినవాడు రావద్దా? వచ్చేస్తాడు.

సుగు: ఏమొస్తాడో ఏమోనండీ! అతనొచ్చేసరికి టైటిల్స్ పోతాయి. టైటిల్స్ దగ్గర్నించీ చూడకపోతే నాకు సినిమా అర్థంకాదు!

శంక: డోంట్ వర్రీ! వర్రీ అవడం నీ ఆరోగ్యానికి మంచిదికాదు. ఇల్లారా! (సత్యపీఠం చూపించేడు) కూచో....కొంచెం స్థిమితపడు. టైటిల్స్ మిస్‌కాకూడదు. అదేగా నీ ప్రోబ్లమ్!

సుగు: (సత్యపీఠంవేపు నడుస్తూ అన్నది)ఊ... అదే!

శంక: ఓ. కె! ఓ. కె!

(సుగుణ సత్యపీఠమ్మీద కూచుంది.మూడ్ మారింది).

శంక: ఒకవేళ టైటిల్స్ చూళ్ళేదనే అనుకో! ఆ ప్రింటు కొంటాను. ప్రైవేట్‌గా మనిద్దరికే షో అరేంజ్ చేస్తాను. ఓ.కె?

సుగు: (వ్యంగ్యంగా) అబ్బ! నేనంటే మీకెంత ప్రేమండీ!

శంక: (అనునయంగా) అయ్‌కాంట్ హెల్పిట్! నా జీవితం నీ కంకితం!

సుగు: (కోపంగా) ఛీ! ఆ మాటనేందుకు సిగ్గు లేదూ?

శంక: (షాక్ తిన్నాడు) సుగుణా!

సుగు: డబ్బు మాది మిస్టర్! నీకేం పోయింది? ప్రింటు కొంటావ్! సినిమా హాలూ

కొంటావ్! అదంతా నామీద అనురాగ మని కోతలు కోస్తావ్. నామీద నీకెంత అనురాగముందో నాకు బాగా తెలుసు మిస్టర్! బాగా తెలుసు!

శంక: సుగుణా!

సుగు: ఏం? భయంగా వుందా? నీ మోస మేమిటో తెలుసుకున్నానని వణికిపోతు న్నావా?

శంక: లేదు సుగుణా! లేదు! నువ్వేదో కొత్తగా మాటాడుతున్నావ్!

సుగు: అవును. నా గోడు నీకు కొత్తగానే విని పిస్తుంది. కానీ ఇది పాత కథ. నా హృదయంలో చెరిగిపోని పాత బాధ. ప్రతి నిమిషమూ అనుక్షణమూ గుర్తు కొస్తుంది. నిన్ను శాసించే అధికారం నా డబ్బుకుంది. కానీ, భార్యగా నిన్ను అదుపులో పెట్టుకునే ప్రయత్నం చేస్తే నా కాపరం ఎక్కడ తగలబడిపోతుందో నని భయం నాకు. అందుకే నీ దగ్గిర నటిస్తున్నాను. నటించలేక ఛస్తున్నాను.

శంక: (కోపం వచ్చింది. గట్టిగా అరిచేడు) సుగుణా!

[ప్లీడరూ, బోయ్ ఒకపక్క దీనబంధు మరోపక్కా వచ్చి నిలబడి చోద్యం చూస్తు న్నారు]

సుగు: డబ్బుకోసమే నన్ను పెళ్ళాడేవు. డబ్బు కోసమే నన్ను ప్రేమిస్తున్నట్టు నాటక మాడుతున్నావ్. నీ నిజమైన ప్రేమ నంతా రీటాకి ధారపోస్తున్నావు. ఖంగారు పడకు. నీ డైరీలు చదివేను. నీ కపట ప్రేమ తెలుసుకున్నాను. భర్తను విడిచి పెట్టిన భార్యకి ఈ దేశంలో గౌరవం కూడా దూరమవుతుందనే భయంతో- నేనూ తెలుసుకున్న చరిత్ర నాలోనే దాచుకుని కృంగిపోతున్నాను.

శంక: సుగుణా! స్టాప్ దట్ బ్లడీ టాక్!

[అప్పలస్వామివచ్చి నీరసంగా సెల్యూట్ చేసేడు. అతని వెనుకనే మాలీషు నిలబడ్డాడు. అప్పలస్వామిని చూడగానే శంకరానికి ఆశ చిగురించింది. అందుచాత టాపిక్ మార్చేడు]

శంక: టిక్కట్లు వచ్చేయి సుగుణా! మేట్నీకి టైమయింది. గెటప్. ప్లీజ్ గెటప్!

సుగు: హుఁ! జీవితంలో పోగొట్టుకున్న సుఖాన్ని సినీమాల్లో చూసి సంతోషించే హింస నాకొద్దింక! (ఏడ్చింది) నేను మేట్నీకి రాను. నువ్వు నీ ప్లాన్ ప్రకారం రీటా దగ్గిరికే వెళ్ళిపో! నిన్ను కాపలాకాచే ఓపిక నాకు లేదు!

శంక: (రెచ్చిపోయి అరిచేడు) సుగుణా!

సుగు: అరవకు! ఏభై వేలు పోసి కొనుక్కు న్నాను. వాకోసం నువ్వు బతకాలేగానీ, నీకోసం బతికే అవసరం నాకు లేదు. వుండదు.

శంక: యూ బ్లడీ! (లాగి చెంప మీద కొట్టేడు.)

[చూస్తున్న జనం ఒక్కడుగు ముందుకు వేసేరు. సుగుణ లేచి నిలబడింది. చెంప రాసు కుంది. అందర్నీ చూస్తోంది. వెంటనే మామూలు స్థితికొచ్చింది]

సుగు: ఏమిటండీ? ఏం జరిగిందీ?

శంక: (బదులు చెప్పలేదు.)

సుగు: మాటాడరేమండీ? ఇప్పుడేం జరిగిందో చెప్పండి.

దీన: (దగ్గిరికి వస్తూ అన్నాడు) ఏం లేదమ్మా! ఏం జరగలేదు. అబ్బాయేదో తొందర పడ్డాడు.

సుగు: లేదండీ! వారెప్పుడూ తొందరపడరు. తొందరపడి నామీద చెయ్యి చేసుకోరు. వారెంతో మంచివారండీ.... నేనే తొందర పడివుంటాను. (శంకరాన్ని పట్టుక్కుది పింది) మాటాడరేమండీ?....నా కేదో భయంగా వుంది. మాటాడండీ!

దీన: (శంకరంతో) నాయనా — నువ్వలా వచ్చేయ్. (సుగుణతో) అమ్మాయ్ నువ్విలా వచ్చేయ్!(సత్యపీఠంచూపిస్తూ) కూచో ముందు. కాసేపు రెస్టు తీసుకో. ఊఁ....నా మాట వినాలమ్మా! నేను నీ తండ్రిలాటివాడిని. మీ తండ్రిగారూ నేనూ ప్రాణస్నేహితులం .... అందు కైనా నా మాట వినిపించుకుని కూచో వాలి!

[సుగుణ కూర్చుంది, మూడ్ మారింది. దీనబంధు సముదాయిస్తున్నాడు]

దీన: పెళ్ళనేది నూరేళ్ళ పంట. ఒకర్నొకరు అర్థం చేసుకుని—

సుగు: రాజకీయం గురించి మీటింగు పెట్టండి. వింటాను. పెళ్ళి....నూరేళ్ళ పంట గురించి మాట్లాడే హక్కు నాకే వుందండి. ఎందుచేతంటే (ఏడుపు వచ్చింది) ఎందుచేతంటే....నా పెళ్ళి నూరేళ్ళ పంట కాదండీ, మూన్నాళ్ళ ముచ్చట!

దీన: అమ్మాయ్—

సుగు: దయచేసి మీరు మా విషయాల్లో జోక్యం కల్పించుకోవద్దు. ముందా మనిషిని రీటా దగ్గిరికి వెళ్ళిపొమ్మని చెప్పండి. నా కతను కనిపించకూడదు. పొమ్మని చెప్పండి.

శంక: (కోపంతో) సుగుణా! అయ్ విల్ కిల్యూ!

సుగు: విన్నారా! చంపుతాట్ట! నన్ను చంపడమే అతని ఉద్దేశమండీ! (బాధగా అన్నది) అక్కడికి నేనేదో బతికి వున్నట్టు మాటాడుతున్నాడు. అతను యెప్పుడు నా మెళ్ళో మూడు ముళ్ళు వేసేడో అప్పుడే చచ్చిపోయేనండీ.... ఆ పచ్చటి పందిరికింద....ఆ కళ్యాణ మంటపంలో నా శవానికి తాళి కట్టాడండీ ఇతను. ఇంక నేను బతికిందెక్కడ?

[శంకరం తట్టుకోలేకపోయేడు. సుగుణను బలవంతంగా లేవనెత్తి, బిరబిరా ఈడ్చుకు పోయేడు. సుగుణ తెప్పరిల్లింది. ఎంతో అమాయకంగా 'ఏవండీ' అని పిలిచింది. శంకరం ఆగిపోయేడు)

సుగు: ఏవండీ....నా కేవిటో ఇదిగా వుందండి. ....నేనేమి చేస్తున్నానో తెలీకుండా వుందండీ....

[మాలీషు ముందుకు వచ్చేడు. చేతులు జోడించి అన్నాడు]

మాలీ: బాబూ—తమరంతా ఏమీ అనుకోకపోతే నా మాటొకటి తమరు వినిపించుకోవాలి బాబూ!

అప్ప: (లాఠీ నేలమీదకొట్టి అన్నాడు)రేయ్—నమిలేస్తాను. జాగర్త! నువ్వెంటో నీ నీ స్టేటసేంటో చూస్కోవాలిగానీ—ఇంతమంది పెద్దోళ్ళముందు మీటింగెట్టే పవర్సు నీకు లేవు.

మాలీ: నేను చెప్పేదికూడా ఈ పెద్దోళ్ళ మంచికేనండి బాబూ! బాబూ—నేను మాలీసోడ్నే కాని మెదళ్ళు తినేవోడ్ని కాదండి. ఇక్కడోళ్ళందరి మెదళ్ళూ (సత్యపీఠాన్ని చూపించి) ఇదిగో ఈ కుర్చీ తినేస్తదండి. ఏ కుర్చీలో కూర్చున్నా దిగుల్లేదు. దీంటో కూచున్నారా....గోవింద! ఇది చెప్పడానికే ఎళ్ళినోడ్ని మళ్ళా వచ్చేనండి!

అప్ప: రేయ్....గేస్ కొట్టకు. కొరికేస్తాను ఖబడ్దార్! నిప్పు—నిప్పప్పలసామిన్నేను. నే కూర్చుంటాను. ఈ కుర్చీ నా మెదడెట్టా తింటదో చూస్తాను.

[వెళ్ళబోతుండగా బోయ్ ఆపేడు]

బోయ్: అదింతకు మునుపే అయిపోయిందండి. మీ రక్కడ కూర్చుని మీ యస్సైగార్ని తిట్టేరు.

అప్ప: అమ్మో! అమ్మో! ఏంట్రా కూసేవ్? యస్సై దొరవార్ని నేను తిట్టేనా? కళ్ళు పోతాయ్ నాకొడకా! నిన్ను....నిన్ను.... (లాఠీ ఎత్తి కొట్టబోయేడు).

దీన: (కలగజేసుకున్నాడు) ఆగాగు! నాకిప్పుడు బాగా జ్ఞాపకమొస్తోంది నాయనా! సరిగ్గా ఇదే కుర్చీ—అవునిదే! దీనిమీద ధనకోటిగారు కూర్చుని (ప్లీడర్ని చూపెడుతూ) మిమ్మల్ని తిట్టిపోసేరు.

ప్లీడ: (షాక్ తిన్నాడు) నన్నా? నన్ను శ్రీ ధనకోటిగారు తిట్టిపోసేరా? నేన్నమ్మను. నమ్మలేను!

మాలీ: తమరుకూడా దీనిమీద కాళ్ళెట్టి ధనకోటి బాబుగార్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టేరండి! నన్ను కూడా తిట్టేరనుకోండి!

దీన: అప్పుడే కదరా నేను వచ్చింది!

మాలీ: చిత్తం వచ్చేరండి! ఆ కుర్చీని అడి

గేయించుకుని, తమరు దాని మీద కూర్చున్నారండి.

దీన: సరి సరి! వదిలెయ్! ముందా కుర్చీ సంగతేమిటో కనుక్కోండి. అప్పల స్వామీ—

అప్ప: (బెదిరిపోయేడు) నిప్పండి బాబూ— దాన్నంటుకోనెంక! రేయ్—బోయిగా, ఏంట్రా ఈ గోల? దీన్నిక్కడ్నించి తీసేయ్ ముందు.

మాలీ: బెదరు కూడా ఒకపాలి కూచున్నాడండి. బాదెట్టొద్దింక!

ప్లీడ: ఇట్సాల్‌రైట్! ఇంతకీ ఈ కుర్చీ ఈ హోటల్లోదేనా?

బోయ్: ఇక్కడిదే సార్! నిన్నటి వరకూ బాగుంది. ఇప్పుడేమొచ్చిందో రోగం!

[మాలీషు ధనామని పిట్టొచ్చినట్టు పడిపోయి కుర్చీకింద మిషిన్ని చూసి 'మాలీష్' అని గట్టిగా అరిచేడు. అందరూ అతనివేపు నడుస్తున్నారు.)

మాలీ: బాబూ! ఈ కుర్చీకింద మిషినేదో వుంచేరండి!

దీన: (ఆశ్చర్యంగా) మిషినా?

ప్లీడ: మిషినేమిటండీ?

సుగు: (భర్తతో) విన్నారా.... మిషినట.... తప్పంతా ఆ మిషిన్దేనండి!

శంక: అవునవును! తప్పంతా దానిదే! ఇంతకీ ఆ మిషినెవరుపెట్టి వుంటారు?

[అప్పలసామి ములీషుతో సీరియస్‌గా అంటున్నాడు]

అప్ప: రేయ్....లేరా! లేచి నించో అంతే!

[మాలీషు లేచి నించున్నాడు]

అప్ప: నా దగ్గిరకొచ్చెయ్. (మాలీషు వచ్చేడు) నా కళ్ళల్లోకి సూటిగా చూసెయ్ (చూస్తున్నాడు). చూస్తున్నావా?

మాలీ: చూస్తున్నానండి!

అప్ప: (ఠీవిగా) నా పేరేంటి?

మాలీ: అప్పలసామండి!

అప్ప: నిప్పు....నిప్పు. మరిచి పోయేవురా యెదవ! దొక్కలో పొడుస్తా-అడిగిందానికి నిజమే చెప్పాలి. ఏం టర్దమైందా?

మాలీ: అట్టాగే బాబూ! అంతా నిజమే చెబుతా!....

అప్ప: ఇంతమంది మేము ఆ కుర్చీమీద కూచున్నామేగాని నువ్వు కూచోలేదు. అవునా?

మాలీ: అవును బాబు!

అప్ప: దానికింద ఏముందో ఏముంటదో మాకెవరికీ తట్టలేదు. నీకు తట్టింది. ఏంటవునా? అవునను.

మాలీ: నిజమే బాబు!

అప్ప: అదదీ! అట్టారా దారికి! ఇప్పుడు చెప్పరా నాయనా! ఆ మిషను ఎప్పుడు యెవడు తగిలించేడో సమస్తం చెప్పెయ్!

మాలీ: అది నా కెట్టా తెలుస్తుందండీ?

అప్ప: నమిలి మింగేస్తానొరేయ్! నే నడిగిందానికి టకటకా ఆన్సర్లొచ్చేయాల్సిందే మరి! మేమింతమందిమి తెలవక కుర్చీ యెక్కి యెదవలయ్యేం. నువ్వెక్కలేదు. అసలు కతంతా కుర్చీకింద వుందని మా కెవరికీ తెలవదు. నీకు తెలిసిపోయింది. మాలీసోడికి పోలీసోడి కంటే బుర్రెక్కువంటే మా లా వప్పుకోదు. ఆదెవడో ఇక్కడెదో పెట్టేడు. అది నువ్ చూసేవ్. చూసింది చెప్పడం నీ డూటీ! ఏం టర్దమైందా? ఎ. బి. సి. డీ.లు చదువుతాను. జడ్ వచ్చేలోగా చెప్పాలంతే! ఎ—

మాలీ: (భయంగా) బాబూ!

అప్ప: బి!

మాలీ: బాబూ!

అప్ప: సి.డి.ఇ.యఫ్-యఫ్-యఫ్-ఆ తర్వాతేంటండీ? నాకు ఇంగ్లీషు రాదు. ఎవరైనా అందుకోండి!

ప్లీడ: నువ్వాగు! ఆ సంగతేమిటో నేను కనుక్కుంటాను. ఒరే మాలీషూ-

మాలీ: బాబూ!

ప్లీడ: ప్రమాణం చేయరా! దేముని ఎదుట!

[మాలీషు నవ్వేడు]

ప్లీడ: నోర్మూయ్!

[మాలీషు నవ్వు ఆపేడు]

ప్లీడ: ఎందుకు నవ్వుతావ్?

మాలీ: ఏం లేదు బాబూ! (కుర్చీ చూపించి) దేవుడ్నే దిం వేసుకున్నాం గదా. ఇంకా పెమాణాలూ, సాచ్చికాలూ, బోన్లూ అనవసరమండి!

శంక: అట్లా వచ్చేవా? వెరీ గుడ్! కనుక- ఆ కుర్చీ ఎక్కు. చచ్చినట్టు నిజమే చెబుతావ్!

మాలీ: పత్యేకించి కుర్చీ ఎక్కక్కర్లేదు బాబూ! నేలమీదున్నా నిజమే చెబుతా. నాకు నిజమొక్కటే ఆస్థండి. (లాయర్నీ, దీనబంధునీ చూపెడుతూ) ఈ బాబులకు వళ్లు పట్టినప్పుడు కుర్చీ పవరు నాక్కూడా అంటుకుంటుందండి. అప్పుడూ నిజమే మాటాడేను.ఇప్పుడూ నిజమే మాటాడుతుండాను.

సుగు: అతని మాటలు నమ్మొద్దు. ముందు కుర్చీ ఎక్కమనండి!

అప్ప: (మాలీషుమీద లాఠీ ఎత్తి) రేయ్.... ఎక్కరా ముందు!

దీన: (మాలీషు మీదికొస్తూ) పెద్దల మాట వినాలి నాయనా!

ప్లీడ: (మాలీషు మీదికొస్తూ) ఊ.... ఎక్కు ముందు!

మాలీ: (చేతుల్తో వారిస్తూ అన్నాడు) అట్టాగే బాబూ.... అట్టాగే!

[కుర్చీ ఎక్కేడు. పకపకా నవ్వేడు. నిల బడి యింకా నవ్వుతున్నాడు. మిగతా వాళ్ళు ఒకరి మొహాలొకరు చూసుకుంటున్నారు. మాలీషు యింకా నవ్వుతూనే వున్నాడు]

అప్ప: రేయ్—నవ్వొద్దు. గబగబా నిజం చెప్పేయ్!

[మాలీషు నవ్వు ఆపేడు. అతనికి సొంత కథ జ్ఞాపకానికొచ్చింది. బాధగా ప్రారం భించేడు]

మాలీ: ఇట్టాంటి పెద్ద పెద్ద హోటళ్ళకొచ్చి పెద్ద పెద్దోళ్తో బేరాలెట్టుకోడం మా తప్పే బాబూ! పెద్దతప్పే.... నాలుగు రోజుల్నుంచీ అన్నంలేదండి. ఇంటిది మంచమెక్కి వారం రోజులయ్యింది. బాబూ! పిల్లలంతా అయ్యా వొన్నం... అయ్యా వొన్నమని అలమటిస్తున్నా రండి. అదుగో బాబూ....అప్పుడే ఈ బెదరు కనిపించేడు. పెద్ద బేరముంది రమ్మని నన్నిక్కడికి అట్టుకొచ్చేడు. గేటు బయట పిల్లల్నెట్టి నేనిట్టా వచ్చే నండి. అంతేగాని బాబూ— ఈ మిషి నేంటో....ఎవరు కుర్చీకి అంటించేరో నాకు తెలవదు. తెలవదు. పెట్టినో దెవడోగాని— ఆడు దేవుడు. ఆడికి మనమంతా దణ్ణం పెట్టేయాలి.

దీన: కాదు నాయనా. వాడికి ఉరిశిక్ష వేయాలి!

శంక: (ఆశ్చర్యంగా) కుర్చీ యెక్కినా మాట మార్చడం లేదు.

సుగు: వాడికి ఆ ట్రిక్కులన్నీ తెలుసండి!

బోయ్: లేకపోతే వీడేం హరిశ్చంద్రుడా? దేవుడా?

ప్లీడ: (మాలీషుతో) అంతేనా? ఇంకా ఏమైనా చెప్పదలచుకున్నావా?

మాలీ: (ధైర్యంగా — రోషంగా) చెబుతాను బాబూ! చెబుతాను! అసలీ మిషన్‌మీద మీ బయమేంటో చెబుతాను. (దీన బంధుని చూపెడుతూ) మీ మీటింగుల్లో ఈ మిషినుంటే— "సోదర సోదరీ మణుల్లారా — మీ ఓట్లన్నీ నాకే వేయండి. మిమ్మల్ని ముప్పైఏమూడు చెరువుల నీళ్ళు తాగించేస్తానేంటను కున్నారో" అని నమ్మకంగా చెప్పేస్తా రని మీ బయం.

[దీనబంధు దెబ్బతిన్నాడు. మాలీషు కుర్చీ దిగేడు. లాయరు వేపు నడుస్తూ]

మాలీ: బోనెక్కిన కూనీకోరు 'బాబూ-ఆ కూనీ నేనే చేసేనండీ' అని నేర మొప్పు కుంటే మీ బోర్డులు తిరగబడి పోతా యని మీ బయం! (శంకరంతో) నువ్వంటే నా కిష్టంలేదు మొగుడోనని

పెళ్లాం చెప్పే నిజంతో మొగుళ్ళకి పిచ్చెక్కుతుందని మొగుళ్ళ బయం! (సుగుణతో) నీ డబ్బుకి మూడుముళ్ళు ఏసేనే గాని నువ్వంటే రోతని మొగుడనే నిజంతో పెళ్లాలు ఉరేసుకుని చావాలని పెళ్లాల బయం!(అప్పలస్వామితో) వందకతికేనని ఈ బాబు యసైబాబుతో చెబుతె, వెయ్యి తిన్నానని యసై బాబు సిఅయి బాబుతో అంటాడని పోలీసోళ్ల బయం!(బోయ్‌తో) కోన్‌కిస్కా గొట్టం గాడివి నువ్వెంత, నీ ఉద్యోగమెంతని ప్రొప్రయిటర్తో తగూలాడి ఉద్యోగం పోగొట్టుకుంటామని వుద్యోగాలు చేసే వాళ్ళ బయం! (ప్రేక్షకుల్తో)నీకుమందూ మాకుల్తో పన్లేదు. నువ్వు రెండురోజుల్లో గ్యారంట్రీగా ఛస్తావని డాటరుబాబు రోగిష్టోడితో నిజంచెప్పి బేరం పోగొట్టుకుంటామని డాటర్ల బయం! (ఆగి అన్నాడు) ఇన్ని బయాలెట్టుకున్నారు గనకనే దీన్ని చూసి అల్లాడిపోతన్నారు. దీన్ని కనిపెట్టినోడికి దండెయాల్సింది పోయి ఉరెయ్యాలంటున్నారు. ఏం బాబూ? అంతేనా?

దీన: చూడు నాయనా. నువ్వు పేదవాడివి. ఈ దేశంలో నీ మాటకు విలువే లేదు. అందుచేత నువ్వు నిజంచెప్పినా అబద్ధం చెప్పినా గొడవ రాదు. కానీ— మా విషయం వేరు. మామాట వేదవాక్కు. మా ఉనికి దేవుడ్తో సమానం. అంచేత మాకు అలాంటి మిషన్లు ఆటంబాంబు లవుతాయ్ తప్ప ఆటవస్తువులు కాలేవు.

మాలీ: అంటే? నిజాన్ని చంపేసి బతకాలంటారా బాబు!

దీన: అట్లా బతక్కపోతే పశువులమౌతామే గానీ మనుషులం కాలేం. మనిషికీ మనిషి మనసుకీ మధ్య ముసుగొకటి కావాలి. ఆ ముసుగులేకపోతే ప్రపంచ వ్యాపారం దివాలాతీస్తుంది. అల్లకల్లోలం నిత్య అరాచకం రాజ్యం చేస్తుందని శనక్కాయల నరసింహమూర్తి ఎప్పుడో చెప్పేడు. నాయనా మాలీషూ—పెద్దవాణ్ణి చెబుతున్నాను- దాన్ని ని చేత్తో నువ్వే ధ్వంసం చెయ్.

మాలీ: చేయకపోతే?

ప్లీడ: నువ్విక్కడ్నుంచి వెళ్ళలేవు!

శంక: నీ పీక పిసికి చంపుతాం.

బోయ్: నిన్నిక్కడే పూడ్చిపెట్టేస్తాం!

మాలీ: ఎంత పిచ్చోళ్ళండి బాబూ మీరు? ఈ మిషిను పోతే ఇంకోటెలుస్తాదండి. ఒకటి కనిపెట్టినోడికి రెండోది చేయడం కష్టం కాదు బాబూ!

సుగు: అది కనిపెట్టిన మనిషెవరో నువ్వే చెబుతావ్!

మాలీ: అమ్మా! ఆ ధర్మాత్ముడెవరో నాకు తెలవదమ్మా!

దీన: తెలీదంటే రాజకీయం ఊరుకోదునాయనా! హింస పెడితే నువ్వే చెబుతావు. (మిగితావారితో) ఇంకా చూస్తారేమిటండీ....కార్యక్రమం ప్రారంభించండి!

[పోలీసు మాలీషుమీద దాడిచేస్తున్నాడు చెప్పరా....చెప్పరాని కొడుతున్నాడు. బాబూ-నాకు తెలవదనే అంటున్నాడు మాలీషు. అతను పారిపోవడానికి ప్రయత్నించినప్పుడు, అందరూ అతని చుట్టూ మూగేరు. మాలీషు కిందపడిపోయాడు. గావుకేక పెట్టేడు. ఫ్రీజ్....

రాంబాబు తన గదినుంచి బయటకువచ్చేడు. నథింగ్ బట్ ట్రూత్ తీసుకున్నాడు. ప్రేక్షకుల్తో అన్నాడు]

రాం: ఓవర్! తెలివితక్కువతనం నాది!(నథింగ్ బట్ ట్రూత్‌ని చూపెడుతూ) దీనితో లోకకళ్యాణం ఎట్లాగూ జరగదు. (ఫ్రీజ్ వేపు చూపెడుతూ) హింసాకాండం నా కిష్టంలేదు. ఒక అమాయకుడు పదుగురి మధ్య నలిగిపోవడం నరకం. నరకాన్ని సృష్టించే ప్రయోగం నేను చేయను. చేయలేను. సో-అయ్‌మస్ట్-రేదర్-డిస్ట్రాయ్‌దిస్ నథింగ్ బట్ ట్రూత్. గుడ్‌నైట్!

[అతను నథింగ్ బట్ ట్రూత్‌ని నేలకేసి కొట్టే ప్రయత్నంలో వుండగా— తెర!]

సమాప్తం